ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

ఆదివారం 30 నవంబరు 2025

ముందస్తు చర్యలు చేపడుతున్నాం

రెవెన్యూ మంత్రి రామచంద్రన్



మెరీనాబీచ్‌లోని ఎళిలగమ్ కంట్రోల్ రూమ్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తుఫాన్ ముందస్తు చర్యలపై జిల్లా కలెక్టర్లతో చర్చలు జరుపుతున్న మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తీరం వైపు దూసుకొస్తున్న 'దిత్వా' తుఫాన్, తీవ్రరూపం దాల్చిన ఈశాన్య రుతుపవనాల కారణంగా ఇప్పటివరకూ రాష్ట్రమంతటా కురిసిన భారీ వర్షానికి పెద్దగా నష్టం వాటిల్లలేదని రెవెన్యూ శాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ తెలిపారు. మెరీనాబీచ్ ఎళిలగమ్‌లో తుఫాన్ పరిస్థితులను తెలుసుకునేందుకు ఏర్పాటైన కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. అక్కడి అధికారులతో 'దిత్వా' తుఫాన్ కదలికల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత రామనాధపురం, పదుకోట, నాగపట్టినం తదితర జిల్లాలకు చెందిన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చలు జరిపారు. తుఫాన్ ముందస్తు చర్యలు చేపట్టమంటూ కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తర్వాత ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తుఫాన్ తీరం దాటేంతవరకూ ప్రజలు ఇంటిపట్టునే గడపాలని ముఖ్యమంత్రి స్టాలిన్ జారీ చేసిన హెచ్చరికను తప్పకుండా పాటించాలని చెప్పారు. ఇప్పటివరకూ కురిసిన వర్షాలకు ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదని, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడలేదని చెప్పారు. ఈ వర్షాలకు ఇప్పటివరకూ అందిన సమాచారం మేరకు 16 పశువులు మృతి చెందాయని, 24 గుడిసెలు కూలిపోయాయని, రాష్ట్ర ప్రభుత్వం తుఫాన్ ముందస్తు జాగ్రత్త చర్యలను చేపడుతోందని తెలిపారు. శనివారం ఉదయం 8.30 గంటలతో ముగిసిన 24 గంటలలో నాగపట్టినం సమీపం తోప్పుతురై వద్ద గరిష్ఠస్థాయిలో 20 సెం.మీల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. ఈ తుఫాన్ కారణంగా కడలూరు, విల్లుపురం జిల్లాలకు ఎక్కువగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని చెబుతున్నారని, 'దిత్వా' తుఫాన్ నగరం వైపే దూసుకొచ్చి తీరం దాటే అవకాశం ఉందని స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు ప్రకటించారని చెప్పారు. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం జిల్లా వాసులు ఆదివారం వరకు అత్యవసరపనులకు తప్ప మిగతా సమయాల్లో ఇంటిపట్టునే గడపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తుఫాన్ తర్వాత రాష్ట్రంలో పడవలు, పంటలకు జరుగనున్న నష్టాలను లెక్కగడతామని చెప్పారు. ఈ నష్టాలకు తక్షణ నష్టపరిహారం చెల్లించేందుకు జిల్లా అధికారులు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశాలిచ్చారని చెప్పారు. తుఫాన్ కదలికలపై మంత్రులు, అధికారులు, ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రమంతటా 28 విపత్తు సహాయ బృందాలు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా మరో 10 సహాయ బృందాలను రప్పించనున్నామని చెప్పారు. వైమానిక దళం, నావికాదళం అధికారులు కూడా తుఫాను బాధిత ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టేందుకు ఇప్పటికే సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఆదివారం తుఫాన్ ప్రభావాన్ని బట్టి అవసరమైన జిల్లాలకు అదనపు నిఘా అధికారులను పంపుతామని రామచంద్రన్ తెలిపారు. అన్ని జిల్లాల్లో 6 వేలమందికి పైగా సహాయ సిబ్బంది సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు.





పట్టినంబాక్కం బీచ్ వద్ద నిలిపి ఉంచిన పడవలు - రామేశ్వరం సమీపంలో పాంబన్ రైలు వంతెనల వద్ద పొంగి ప్రవహిస్తున్న సముద్ర జలాలు

చెన్నైకి చేరువగా దిత్వా తుఫాన్

- సముద్రతీర జిల్లాలకు రెడ్ అలర్ట్
- 90కి.మీ.ల వేగంతో పెనుగాలులు
- రాష్ట్రానికి 2 రోజులపాటు వర్షసూచన

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న 'దిత్వా' తుఫాన్ ఆదివారం ఉదయం చెన్నై తీరాన్ని సమీపించనుందని స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు ప్రకటించారు. దీంతో సముద్రతీర జిల్లాల్లో గంటకు 90 కి.మీల వేగంతో పెనుగాలులు వీస్తాయని, 14 జిల్లాల్లో భారీగా వర్షం కురుస్తుందని హెచ్చరించారు. ఆదివారం ఉదయం నైరుతి బంగాళాఖాతం, ఉత్తర తమిళనాడు ఆగ్నేయ దక్షిణాంధ్ర తీరాల వైపు వేగంగా కదలుతుందని, ఆసందర్భంగా తుఫాన్ చెన్నై నుంచి 50 కి.మీ. దూరంలో, సాయంత్రం 25 కి.మీ.ల దూరంలో కేంద్రీకృతమవుతుందని స్థానిక వాతావరణశాఖ డైరెక్టర్ పి.సెంథామరై కన్నన్ ఓ ప్రకటన జారీ చేశారు. తుఫాన్ కారణంగా రాష్ట్రంలోని ఉత్తరాది జిల్లాల్లో కొన్నిప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో చెదురుముదురుగా వర్షం కురుస్తుందని తెలిపారు. సముద్రతీర జిల్లాలు, డెల్టా జిల్లాలు, కారైక్కాల్ ప్రాంతాల్లో గంటకు 55 నుండి 65 కి.మీ.ల వేగంతో పెనుగాలులు వీస్తాయన్నారు. కొన్ని సమయాల్లో గంటకు 75కి.మీ.ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పుదుచ్చేరిలో గంటకు 60 నుండి 70 కి.మీ.ల వేగంతో పెనుగాలులు వీస్తాయన్నారు.

నగరం వైపు తుఫాన్

బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న 'దిత్వా' తుఫాన్ గంటకు 10 కి.మీ.ల వేగంతో ఉత్తర, వాయువ్యదిశగా తీరం వైపు దూసుకొస్తోందని వాతావరణ పరిశోధన కేంద్రం సౌత్‌జోన్ అధ్యక్షురాలు అముదా తెలిపారు. శనివారం సాయంత్రం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ 'దిత్వా' తుఫాన్ నగరానికి 350 కి.మీ.ల దూరంలోను, పుదుచ్చేరికి 250 కి.మీల దూరంలో కారైక్కాల్‌కు 150 కి.మీల దూరంలో, వేదారణ్యానికి 140 కి.మీల దూరంలో ఉందని ఆమె వివరించారు.



అముదా

9 జిల్లాలకు భారీ వర్షసూచన

తుఫాన్ తీరం దాటనున్న కారణంగా ఆదివారం తిరువళ్లూరు, రాణిపేట జిల్లాల్లో భారీగా, ఓ మోస్తరుగా వర్షం కురుస్తుందని అధికారులు తెలిపారు. చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, విల్లుపురం, తిరువణ్ణామలై, వేలూరు, తిరుపత్తూరు, కృష్ణగిరి, ధర్మపురి జిల్లాల్లో కుండపోతగా వర్షం కురుస్తుందని పేర్కొన్నారు. సేలం, కళ్లకురిచ్చి, కడలూరు జిల్లాలో పుదుచ్చేరిలోని కొన్ని ప్రాంతాల్లో చెదురుముదురుగా వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. చెన్నై నగరంలో, శివారు ప్రాంతాల్లోనూ ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో భారీగా వర్షం కురుస్తుంది.

నగరంలో ముందస్తు ఏర్పాట్లు

ఆది, సోమవారాల్లో 'దిత్వా' తుఫాన్ కారణంగా ఏర్పడనున్న వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో లక్ష దాకా సహాయ వస్తువులను సిద్ధంగా ఉంచినట్లు కమిషనర్ జే కుమారగురుపరన్ తెలిపారు. భారీ వర్షం కారణంగా నగరంలో రహదారులపై ప్రవహించే నీటిని తొలగించేందుకు 100 హార్స్‌పవర్‌ల సామర్థ్యం కలిగిన 170 మోటారు పంపులను, తక్కువ హార్స్ పవర్ కలిగిన 1400లకు పైగా మోటారు పంపులను కూడా సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. నగరంలోని 22 సబ్‌వేలలో ప్రవహించే వర్షపు నీటిని ఎప్పటికప్పుడు తొలగించేందుకు ఆయా సబ్‌వేల వద్ద భారీ మోటారు పంప్‌సెట్లను ఏర్పాటు చేశామన్నారు. తుఫాన్ కారణంగా కూలే చెట్లను తొలగించడానికి 15 హైడ్రాలిక్ యంత్రపు కోత వాహనాలు, రెండు ఎత్తయిన హైడ్రాలిక్ నిచ్చెనలు, 224 చిన్న సైజు యంత్రపు రంపాలు, 216 టెలిస్కోపిక్ కోత యంత్రాలు కూడా సిద్ధం చేసినట్లు వివరించారు.



గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం సామగ్రిని సిద్ధం చేస్తున్న సహాయక బృందం

2 రోజులు చేపలవేట నిషేధం

తుఫాన్ కారణంగా సముద్ర తీరాలలో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని, అలల తాకిడి ఉధృతంగా ఉంటుందని రాష్ట్ర మత్స్యశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఆది, సోమవారాల్లో జాలర్లు చేపలవేటకు వెళ్లకూడదని ప్రకటించారు. ఆదివారం ఉదయం సముద్రతీరం పొడవునా గంటకు 90 కి.మీ.ల వేగంతో, సోమవారం గంటకు 65 కి.మీ.ల వేగంతో పెనుగాలులు వీస్తాయని పేర్కొన్నారు.

విద్యా నిధులను విడుదల చేయండి

> అన్ని ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వండి!
> డీఎంకే ఎంపీల సమావేశంలో డిమాండ్
> 12 తీర్మానాల ఆమోదం

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెల్లించాల్సిన రూ.3548.22 కోట్ల విద్యా నిధులను వెంటనే విడుదల చేయాలని, పార్లమెంట్ సమావేశాల్లో తమ పార్టీ ఎంపీలు అడిగే ప్రశ్నలకు తప్పకుండా సమాధానాలు చెప్పాలని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిసెంబర్ ఒకటి నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో శనివారం పార్టీ ఎంపీల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చేసిన 12 తీర్మానాలను ఎంపీలందరూ ఆమోదించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ఎంపీలడిగే ప్రధానమైన ప్రశ్నలకు ఖచ్చితంగా సమాధానం చెప్పి తీరాలని డిమాండ్ చేశారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం అని గర్వంగా చెప్పకుంటున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమిళ ప్రజల డిమాండ్లను, కోర్కెలను విస్మరించడం న్యాయమేనా? అని ప్రశ్నించారు. రాష్ట్రానికి సంబంధించిన సమస్యలను లేఖల ద్వారా, ప్రధానిని, కేంద్ర మంత్రులను స్వయంగా కలుసుకుని వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోకపోవడం గర్హనీయమని విమర్శించారు. శాసనసభలో చేసిన తీర్మానాలపై కూడా స్పందించకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మౌనం పాటించడం తగదన్నారు. పన్నుల రూపంలో అత్యధిక ఆదాయాన్ని అందించే రాష్ట్రాన్ని అన్ని విధాలా వంచించడాన్ని మనస్సాక్షి ఉన్నవారెవరూ అంగీకరించరని, ఈ ఆటుపోట్లను అధిగమించే రాష్ట్రం దేశంలో 11.19 శాతం ఆర్థికాభివృద్ధిని సాధించిందని తెలిపారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అడుగులకు మడుగులొత్తే ప్రభుత్వం లేదని, తమిళ ప్రజలు బానిసల్లా తలవంచడమంటూ జరుగదని, తలెత్తుకుని గౌరవంగా వ్యవహరిస్తారని స్టాలిన్ పేర్కొన్నారు. రాబోవు పార్లమెంట్ సమావేశాల్లో డీఎంకే ఎంపీలు ప్రధాన సమస్యలపై అడిగే ప్రశ్నలకు కేంద్రంలోని బీజేపీ పాలకులు తప్పకుండా సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్, కోశాధికారి టీఆర్ బాలు, ముఖ్య కార్యదర్శి కేఎన్ నెహ్రూ, డీఎంకే పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు కనిమొళి, రాజ్యసభలో డీఎంకే సభాపక్షనాయకుడు తిరుచ్చి శివా, ఎంపీలు దయానిధి మారన్, జగద్రక్షగన్, ఎ.రాజా, తమిళచ్చి తంగపాండ్యన్, డాక్టర్ కళానిధి వీరాసామి, విల్సన్, తంగతమిళ్‌సెల్వన్, డాక్టర్ రాణి, అరుణ్‌నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలు

1. రాష్ట్ర హక్కులను గౌరవించకుండా అన్ని విధాలుగా రాష్ట్రాన్ని వంచిస్తున్న కేంద్రంలోని బీజేపీ పాలకుల తీరును ఖండిస్తూ తీర్మానం
2. రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులో రాష్ట్రంపై వివక్షతను ప్రదర్శిస్తూ, దీర్ఘకాలిక రైల్వే ప్రాజెక్టులను ప్రకటించకుండా నిర్లక్ష్య ధోరణిని అనుసరిస్తున్న కేంద్రం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తీర్మానం.
3. ప్రధాని నరేంద్రమోదీ జోక్యం చేసుకుని కోయంబత్తూరు, మదురై మెట్రోరైలు ప్రాజెక్టులకు అనుమతి జారీ అయ్యేలా చర్యలు చేపట్టాలి.
4. కోయంత్తూరు, మదురై విమానాశ్రయాల విస్తరణ, పనులు, మదురై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా మార్చే ప్రాజెక్టులకు కేంద్రం తక్షణమే అనుమతి జారీ చేయాలి.
5. కరుణానిధి పేరుతో విశ్వవిద్యాలయం ఏర్పాటుకు రాష్ట్రపతి ఆమోదంతెలపాలి. బిల్లులపై ఆమోదం తెలిపేందుకు గవర్నర్‌కు కాలపరిమితిని నిర్ణయించాలని ఎంపీలందరూ కేంద్రంపై ఒత్తిడి చేయాలి.
6. పోషకాలు కలిగిన బియ్యం పంపిణీ పథకంలో తమిళ రైతులకు హాని కలుగకుండా చర్యలు చేపట్టాలంటూ స్టాలిన్ చేసిన అభ్యర్థనను ఆమోదించాలి.
7. ధాన్యం సేకరణలో తేమ శాతాన్ని 17 శాతం నుంచి 22 శాతానికి పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటన జారీ చేయాలి.
8. సమగ్ర శిక్షా విద్యాపథకానికి నెలల తరబడి విడుదల చేయని రూ.3548.22 కోట్ల నిధులను తక్షణమే విడుదల చేయాలి.
9. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నాలుగు కార్మికుల చట్టాల వల్ల కార్మికుల హక్కులకు ఎలాంటి భంగం కలుగకుండా జాగ్రత్తలు వహించాలి.
10. శ్రీలంక నావికాదళం సభ్యులు అరెస్టు చేసిన తమిళ జాలర్లందరినీ విడిపించేందుకు తగు చర్యలు తీసుకోవాలి. జాలర్ల పడవలను కూడా మత్స్యకారులకు తిరిగి ఇచ్చేలా చర్యలు చేపట్టాలి. తమిళ జాలర్ల సుదీర్ఘ సమస్యలకు శాశ్వత చర్యలు చేపట్టాలి.
11. నియామక పత్రాలు అందుకుని ప్రస్తుతం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారి ఉద్యోగాలు, పదోన్నతులకు హాని కలుగకుండా కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలి.
12. గ్రామీణ పేదలకు అమలు చేస్తున్న మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం నిధులను తక్షణమే విడుదల చేయాలి.



డీఎంకే ఎంపీల సమావేశంలో మాట్లాడుతున్న ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

ఖాళీ సీసాల వ్యవహారం

3న టాస్మాక్ ఉద్యోగుల సమ్మె




సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణన్

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖాళీ సీసాలను టాస్మాక్ ఉద్యోగులు సేకరించాలని జారీచేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వచ్చే డిసెంబరు 3న విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొననున్నట్లు తమిళనాడు ప్రభుత్వ టాస్మాక్ కార్మికుల సంఘ నాయకుడు కె.బాలకృష్ణన్ ప్రకటించారు. తిరుచ్చి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో బాలకృష్ణన్ మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టాస్మాక్ మద్యం చిల్లర విక్రయ దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఖాళీ సీసాలను సేకరించాలని టాస్మాక్ సంస్థ ఉత్తర్వులు జారీచేసిందని, కార్మిక చట్టానికి ఇది వ్యతిరేకమని తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 12 గంటల వరకు విక్రయాల్లో పాల్గొంటున్న టాస్మాక్ సిబ్బందిపై మరింత పనిభారం పెంచేలా ఉన్న ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ అన్ని కార్మిక సంఘాలు ప్రభుత్వానికి లేఖ రాయడంతో పాటు పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. తమ కోరికను పరిశీలించి పరిష్కరింపజేయాలని డిమాండ్ చేస్తూ వచ్చే బుధవారం రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొంటామని బాలకృష్ణన్ తెలిపారు.

చెంబరంబాక్కం నుంచి

1200 ఘనపుటడుగుల జలాల విడుదల



జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

అడయార్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగరానికి తాగునీటిని సరఫరా చేసే చెంబరంబాక్కం చెరువు నుంచి ఉపరితల నీటిని జలవనరుల శాఖ అధికారులు శనివారం విడుదల చేశారు. దిత్వా తుఫాను కారణంగా నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. దీంతో చెంబరంబాక్కం చెరువులోకి నీరు వచ్చి చేరుతుంది. దీంతో ముందు జాగ్రత్త చర్యగా చెరువు నుంచి ఉపరితల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శనివారం మధ్యాహ్నం 1200 ఘనపుటడుగుల నీటిని విడుదల చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళాలని అధికారులు సూచించారు.

పీఎంకే అధ్యక్షుడు అన్బుమణే

కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటన ● రాందాస్ వర్గం ఆందోళన



ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) అధ్యక్షుడిగా డాక్టర్ అన్బుమణి 2026 ఆగస్టు 1వ తేదీ వరకు కొనసాగుతారని కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటన విడుదల చేయడంపై అన్బుమణి తండ్రి రాందాస్ వర్గం ఆందోళనకు గురైంది. పీఎంకే అధ్యక్ష పదవికి సంబంధించి తండ్రీ కొడుకుల మధ్య చోటు చేసుకున్న అభిప్రాయ భేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. వీరిని బుజ్జగించేందుకు పీఎంకే నేతలు చేపట్టిన ప్రయత్నాలు ఫలించలేదు. మరో వైపు రాందాస్, అన్బుమణిల తరుపున వేర్వేరుగా పీఎంకే అధ్యక్ష పదవికి సంబంధించి ఆరోపిస్తూ పలులేఖలు కూడా పంపించారు. ఈ నేపథ్యంలో, కేంద్ర ఎన్నికల కమిషన్ పీఎంకే వ్యవస్థాపకులు డాక్టర్ రాందాస్‌కు పంపించిన లేఖలో అన్బుమణి పదవీకాలం గత మే 28న ముగిసిందని, గత మే 30వ తేదీ నుండి పీఎంకే కొత్త అధ్యక్షుడిగా రాందాస్ ఎంపికైనట్లు ఆయన తరుపున ఈసీకి లేఖ సమర్పించారు. దీనిని పరిశీలించిన అధికారులు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పీఎంకే నిర్వాహకుల పదవీకాలం వచ్చే ఏడాది ఆగస్టు 1వ తేదీ వరకు చెల్లుబాటు అవుతుందని, ఇందువల్ల అన్బుమణి పీఎంకే అధ్యక్షుడిగా కొనసాగుతారని ఈసీ ఆ లేఖలో స్పష్టం చేసింది. ఈ లేఖ ప్రతిని తమిళనాడు ఎన్నికల ప్రధాన అధికారికి కూడా ఈసీ పంపించడంపై రాందాస్ వర్గానికి చెందిన నేతలు ఆందోళనకు గురైయ్యారు. దీనితో రాందాస్ తరుపున ఆ పార్టీ గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే జీకే.మణి హటాహుటిన శుక్రవారం ఢిల్లీకి చేరుకుని ఎన్నికల కమిషన్‌కు మొరపెట్టుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అన్బుమణి నకిలీ పత్రాల ద్వారా కేంద్ర ఎన్నికల కమిషన్‌ను నమ్మించి మోసం చేశారని, ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి చర్యలకు పాల్పడటం క్షమించరాని నేరమన్నారు. తమకు న్యాయం జరగకుంటే ఎన్నికల కమిషన్ వైఖరిని ఖండిస్తూ ఢిల్లీలో భారీస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని జీకే.మణి హెచ్చరించారు.

నా హక్కును కోల్పోను: రాందాస్

పీఎంకే అధ్యక్షుడు అన్బుమణే అని కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించడంపై స్పందించిన ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ తన హక్కును ఎట్టి పరిస్థితుల్లో కోల్పోయేందుకు సిద్ధంగా లేనని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలోని తైలాపురం గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. అన్బుమణి పార్టీ అధ్యక్ష పదవి గడువు ముగిసిందని, ఎన్నికల కమిషన్ ఈ వ్యవహారంలో తనతో ఎటువంటి చర్చలు జరపకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. తన కష్టార్జితంతో కాపాడుకున్న పార్టీని అన్బుమణి అపహరించే ప్రయత్నాలు చేపట్టారని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా పార్టీని కాపాడుకుంటానని ఆయన పేర్కొన్నారు.

సమాచార దృష్టి

ఆవడి కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

● 105 తీర్మానాలకు ఆమోదం

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):తిరువళ్లూరు జిల్లా ఆవడి కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం మేయర్ ఉదయ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశం మొత్తం 105 తీర్మానాలకు ఆమోదముద్ర వేసింది. ఈ తీర్మానాలపై జరిగిన చర్చలో డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్ తదితర పార్టీలకు చెందిన కౌన్సిలర్లు పాల్గొని మాట్లాడారు. ఆవడి ప్రాంతంలో వీధికుక్కల సంచారాన్ని కట్టడిచేయాలని, శునకాల కోసం సహాయక సెంటర్లను ఏర్పాటు చేయాలని, పలు ప్రాంతాల్లో మూతల్లేని డ్రైనేజీలనుమరమ్మతులు చేపట్టాలని కౌన్సిలర్లు కోరారు. దోమల మందు చల్లేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, గుంతలమయమైన రోడ్లను బాగుచేయాలన్న అంశాలపై అధికార ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య వాడీ, వేడి చర్చలు జరిగాయి.

వక్ఫ్ సంస్థల వివరాలు అప్‌లోడ్ చేయాలి

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సంస్థల వివరాలు అప్‌చేయాలని ప్రకటించారు. ఈ మేరకు తమిళనాడు వక్ఫ్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో.. రాష్ట్రంలోని అన్ని వక్ఫ్ సంస్థల ముత్తవల్లిలు, మేనేజింగ్ కమిటీలు, తమ వక్ఫ్ సంస్థల వివరాలను THE UNIFIED WAQF MANAGEMENT EMPOWERMENT EFFICIENCY, AND DEVELOPMENT ACT, 1995 అనే యాక్ట్ ప్రకారం UMEED CENTRAL PORTAL, 2025 "https://umeed.minorityaffairs.gov.in అనే వెబ్‌సైట్‌లో డిసెంబరు 4వ తేదిలోపు అప్‌లోడ్ చేయాలని సూచించింది. ఈ గడువు పొడిగించే అవకాశం ఉండదని, అందువల్ల వక్ఫ్ సంస్థలు నిర్ణీత వ్యవధిలో తమ వివరాలు అప్‌లోడ్ చేయాలని వక్ఫ్ బోర్డు సూచించింది.

పీజీ టీచర్ పరీక్షా ఫలితాల విడుదల

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) టీచర్ల పరీక్షా ఫలితాలు వెలువడ్డాయి. పీజీటీచర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (గ్రేడ్-1), కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ (గ్రేడ్-1) తదితర 1,996 పోస్టుల భర్తీకి గత అక్టోబరు 12వ తేది రాతపరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల ఆన్సర్ కీ, పరీక్షా ఫలితాలు, 1:1:25 నిష్పత్తిలో సర్టిఫికెట్ల పరిశీలన జాబితాను పరీక్షా బోర్డు వెబ్‌సైట్ www.trb.gov.inలో సబ్జెక్టులవారీగా జాబితా ప్రచురించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు అర్హతసాధించిన అభ్యర్థులు,అందుకు సంబంధించిన కాల్ లెటర్, ఇతర ఫారాలను బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని టీఆర్బీ తెలిపింది. కాగా, తమిళ అర్హత పరీక్ష రాసిన 2,20,412 మందిలో సుమారు 85వేల మంది ఫెయిలైనట్లు సమాచారం.

సంబా, ఇతర పంటల బీమా గడువు పొడిగింపు

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంబా, ఇతర పంటలకు బీమా చేసుకొనేందుకు అవకాశం పొడిగించారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో.. ప్రకృతి విపత్తులు, వర్షాలు సహా ఇతర కారణాలతో పంటలు కోల్పోయి నష్టపోతున్న రైతులను ఆదుకొనేలా పంట బీమా పథకం పరిచయం చేశామన్నారు. ప్రస్తుతం సంబా సీజన్ కావడంతో రైతులు అధికంగా వరి పంటతో పాటు ఇతరత్రా పంటలు సాగుచేస్తున్నారు. ఈ పంటలకు బీమా చేసుకునేందుకు ఆదివారం వరకు గడువు ప్రకటించారు. రైతుల విజ్ఞప్తి మేరకు సోమవారం కూడా బీమా చేసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది.

తాంబరం నుంచి నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లు

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్ రైల్వేస్టేషన్ పునరుద్ధరణ పనుల కారణంగా వచ్చే ఐదు రోజులు తాంబరం నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లు బయల్దేరనున్నాయి. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో.. ఆ ప్రకారం, తంజావూరు-చెన్నై ఎగ్మూర్ ఉళవన్ ఎక్స్‌ప్రెస్, కొల్లం-చెన్నై ఎగ్మూర్ ఆనందపురి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, రామేశ్వరం-చెన్నై ఎగ్మూర్ సేతు ఎక్స్‌ప్రెస్, రామేశ్వరం-చెన్నై ఎగ్మూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆదివారం నుంచి డిసెంబరు 4వ తేది వరకు చెన్నై ఎగ్మూర్‌కు బదులు తాంబరంవరకు మాత్రమే నడుపనున్నారు. అలాగే, మరుమార్గంలో కూడా నాలుగురైళ్లు చెన్నై ఎగ్మూర్‌కు బదులు తాంబరంనుంచి బయల్దేరుతాయని దక్షిణ రైల్వే తెలిపింది.

కిలో మల్లెపూల ధర రూ.6,500

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉన్న పలు జిల్లాల్లో కురుస్తున్న మంచు, వర్షం కారణంగా దిగుబడి తగ్గిపోవడంతో పూల ధరలు విపరీతంగా పెరిగాయి. దీనితో ఈరోడ్ శక్తిమంగళం పూల మార్కెట్‌లో శనివారం ఉదయం కిలో మల్లెపూలు రూ.6,500లకు విక్రయించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోవిల్‌లో శుక్రవారం కిలో మల్లెపూలు రూ.3,500 పలుకగా, శనివారం ఒక్కసారిగా రూ.7వేలకు పెరిగింది. రాష్ట్రంలో రెండవ అతి పెద్ద మార్కెట్‌గా పేరొందిన కృష్ణగిరి జిల్లా హోసూరు రైతు మార్కెట్‌కు గత ఐదు రోజులుగా సరఫరా తగ్గిపోవడంతో పూల ధరలు పెంచాల్సి వచ్చిందని వ్యాపారులు తెలిపారు. మల్లెపూలతో పాటు చామంతి, కనకాంబరం, గులాబీలు, ముద్దబంతి తదితర పూల ధరలు కూడా రెట్టింపు అయ్యాయి.

బాలికల హోం నుంచి నలుగురు పరార్

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంచీపురంలోని బాలికల హోం నుంచి నలుగురు బాలికలు తప్పించుకు వెళ్లారు. పిళ్లయార్ పాళయం తాత్తిమేడు ప్రాంతంలో ప్రభుత్వ బాలికల హోంలో 30 మంది బాలికలు బసచేస్తూ చదువుకుంటున్నారు. శనివారం రాత్రి 12గంటలకు ముగ్గురు వార్డెన్లు హోంకు తాళాలువేసి, తాళం చెవులను అక్కడ పనిచేస్తున్న శోభనకు అప్పగించి వెళ్లారు. శోభన నిద్రపోతున్న సమయంలో, నలుగురు బాలికలు ఆమె నుంచి తాళాలు తీసుకుని, హాస్టల్ వెనుక వైపున్న గోడదూకి పరారయ్యారు. పరారైన నలుగురిలో ముగ్గురు కుండ్రత్తూర్‌ప్రాంతానికి, మరొకరు కాంచీపురం ప్రాంతా నికి చెందిన వారని తెలిసింది. ఈ ఘటనపై వార్డెన్ ఫిర్యాదుతో కాంచీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, హోం వెనుక వైపున్న గోడపై ఏర్పాటుచేసిన ఇనుప కంచె దెబ్బతినడంతో, దానిని తొలగించి కొత్త కంచె ఏర్పాటుచేసే పనులు చేపడుతున్నారు. దీనిని అదునుగా చేసుకుని బాలికలు గోడ దూకి పరారయ్యారని పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది.

సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతాప్

తిరువళ్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని తిరువళ్లూరు కలెక్టర్ ప్రతాప్ సూచించారు. తిరువళ్లూరు జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతాప్ అధ్యక్షతన వ్యవసాయ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని శనివారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జిల్లా వ్యాప్తంగా భూమి పరిరక్షణ, మానవ ప్రాణ రక్షణ పథకం కింద సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి పలు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ప్రధాన ఉద్దేశం రసాయన ఎరువుల వాడకాన్ని అరికట్టి, సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని పెంచడం ద్వారా భూసారాన్ని మెరుగుపరవచ్చని తెలిపారు. రసాయన ఎరువులను భూమిలో చల్లడం, రసాయన మందులను పిచికారి చేయడంతో రైతులు పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, రసాయనాలతో పండించిన పంటలను తినడం ద్వారా ప్రజలు రోగాల బారిన పడుతున్నారనే విషయాలపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ పథకం ద్వారా తిరువళ్లూరు జిల్లాలో 7500 ఎకరాల్లో సేంద్రీయ ఎరువులతో వ్యవసాయం చేయాలని, ఇందుకుగాను రూ.93.73 లక్షల రాయితీలను రైతులకు ప్రభుత్వం అందించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ప్రకటించారు. ప్రస్తుతం రైతులకు ప్రాంతీయ వ్యవసాయ అభివృద్ధి కేంద్రాల ద్వారా కిలో రూ.129.4 ధర ఉన్న సేంద్రీయ ఎరువులను ప్రభుత్వం 50 శాతం రాయితీతో రూ.62.50కు అందిస్తుందని తెలిపారు. జిల్లాలోని ఔత్సాహిక వ్యవసాయ పట్టభద్రుల భాగస్వామ్యంతో 10 రైతు సంక్షేమ సేవా కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. వీటి ద్వారా విత్తనాలు, ఎరువులు 30 శాతం రాయితీతో లభిస్తాయన్నారు. వ్యవసాయ పట్టభద్రుల సహకారంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకునేందుకు ప్రోత్సాహకాలు అందిస్తామని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

తిరువళ్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన సంఘటన తిరువళ్లూరులో చోటుచేసుకుంది. జార్ఖాండ్ రాష్ట్రం, దర్వాద్ జిల్లా, కార్కేరి, ఫులారి తండ్ గ్రామానికి చెందిన వ్యక్తి బుద్దన్‌బునియా కుమారుడు అజయ్ బునియా (47) తిరువళ్లూరులోని మెల్నత్తూర్‌లో నివసిస్తూ తిరువళ్లూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో కాంట్రాక్టర్ కూలీగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో, ఈ నెల 24న ఆ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న నారాయణన్ పని పూర్తైన తర్వాత అజయ్ బునియా సహా ఆరుగురు కార్మికులను మెల్నత్తూర్ ఎంజీఆర్‌నగర్‌లోని వారి నివాసం వద్ద వదిలి వెళ్లాడు. మరుసటి రోజు అజయ్ బునియా కనిపించకపోవడంతో అతడి సహచరులు పలు ప్రాంతాల్లో వెతికినా, ఆచూకి తెలియలేదు. దీనితో వారందజేసిన ఫిర్యాదు మేరకు తిరువళ్లూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మేల్ నెడుంగల్లులో...

తిరువళ్లూరు జిల్లా మేల్ నెడుంగల్లు, మేట్టు వీధికి చెందిన హంస (52) అనే మహిళ కుమారుడు రాజా (34) కుటుంబంతో కలిసి కూరగాయల వ్యాపారం చేసుకుని జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో, గత సెప్టెంబరు 28న కోయంబేడుకు కూరగాయలు కొనడానికి వెళ్ళిన ఆమె గుట్కాను అక్రమంగా రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడింది. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదిన ప్రతి రోజు పోలీస్టేషన్‌కు వెళ్లి సంతకం చేయాలనే షరతులతో కోర్టు ఆమెకు బెయిల్ మంజూరుచేసింది. ఈ నెల 24న సంతకం చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో ఆందోళన చెందిన కుమారుడు రాజా అందజేసిన ఫిర్యాదు మేరకు పొదటూర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

హెల్మెట్ ధరించినవారికి కానుకగా కోడిగుడ్లు

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధారణపై విస్తృత ప్రచారం చేపట్టిన గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ విభాగం పోలీసులు హెల్మెట్ ధరించినవారికి కానుకగా కోడిగుడ్లను పంపిణీ చేసి ఉత్సాహపరుస్తున్నారు. వేళచ్చేరి ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో 100అడుగుల రోడ్డులో ఇన్‌స్పెక్టర్ కదిరవన్ నేతృత్వంలో శుక్రవారం హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా అటుగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాల్లో వచ్చిన వారిని అభినందిస్తూ కోడిగుడ్లు బహుమతిగా అందజేసి అవగాహన కల్పించారు. అదేవిధంగా వేళచ్చేరి ప్రధాన కూడళ్లలోని ట్రాఫిక్ సిగ్నళ్లవద్ద రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల గురించి వాహనచోదకులకు లౌడ్‌స్పీకర్ల ద్వారా వివరించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, ఓవర్‌స్పీడ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వల్ల కలిగే నష్టాల గురించి వాహనదారులకు వివరించారు.

టీమ్‌వర్క్‌తోనే కాంగ్రెస్ అభివృద్ధి

● సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి



దరఖాస్తును పంపిణీ చేస్తున్న రఘువీరారెడ్డి, చిరంజీవి

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వందేళ్లకు పైగా ఘన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి తమిళనాట మరింత గుర్తింపు తీసుకొచ్చేలా పార్టీ నిర్వాహకులంతా ఒక బృందంగా పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, ఆల్ ఇండియా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి సూచించారు. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ)కి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల అధ్యక్షులను ఎంపిక చేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం నూతన ప్రక్రియను రూపొందించింది. రాష్ట్రంలోని 38 రెవెన్యూ జిల్లాల్లో వారం రోజుల పాటు మకాంవేసి పార్టీ కార్యకర్తల అభిప్రాయాలు అడిగి తెలుసుకుని, పార్టీపట్ల విశ్వాసంగా ఉంటూ అంకితభావంతో పనిచేస్తున్న ఐదుగురి పేర్లను ఎంపిక చేసి ఆ జాబితాను అధిష్ఠానం దృష్టికి పంపించాల్సివుంది. ఆ రీతిలో శనివారం ఉదయం స్థానిక ఎగ్మూర్‌లోని సిరాజ్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో సెంట్రల్ చెన్నై ఇన్‌ఛార్జిగా నియమితులైన రఘువీరారెడ్డిని ఏఐసీసీ సభ్యుడు కె.చిరంజీవి పరిచయం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేయదలుచుకున్న ఔత్సాహికులకు దరఖాస్తులు అందజేశారు. సమావేశంలో రఘువీరారెడ్డి మాట్లాడుతూ, ప్రతిఫలం ఆశించకుండా పార్టీ ఓటు బ్యాంకు పెరిగేలా పనిచేస్తున్న కార్యకర్తల శ్రమ వృధా కాదని, పార్టీ అభివృద్ధి అనేది టీమ్‌వర్క్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కాగా, పుల్లాపురం ఆదిఆంధ్రా ఇందిరా సేవా సంఘం అధ్యక్షుడు ఇరకట్ల నాగభూషణం సహా 50 మందికి పైగా రఘువీరారెడ్డి నుండి దరఖాస్తు పత్రాలు స్వీకరించారు.

బాలికపై లైంగిక వేధింపుల కేసులో 30 ఏళ్ల జైలు

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడికి 30 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. శివగంగ జిల్లా మానామదురై మారియమ్మన్ ఆలయ వీధికి చెందిన కార్తీక్ (24) గత 2020 అక్టోబరు 4న సమీపంలోని గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలియజేయడంతో దిగ్భ్రాంతి చెందిన వారు, మానామదురై సిప్కాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, పోక్సో చట్టం కింద కేసునమోదుచేసి కార్తీక్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసు శివగంగ పోక్సో ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ ముగిసి, నేరారోపణ రుజువు కావడంతో కార్తీక్‌కు 30 ఏళ్ల జైలు శిక్ష, రూ.55 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి గోకుల్ మురుగన్ శుక్రవారం తీర్పు వెలువరించారు.

దిత్వా తుఫాన్ ఎఫెక్ట్... విమాన చార్జీలకు రెక్కలు

అడయార్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావం కారణంగా రాష్ట్రంలోని దక్షిణాది జిల్లాల్లో భారీ వర్షం కురుస్తుండడంతో చెన్నై నుంచి రాష్ట్రంలోని వివిధ జిల్లా కేంద్రాలకు వెళ్లే విమాన సర్వీసుల ప్రయాణ చార్జీలకు రెక్కలు వచ్చాయి. చెన్నై నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే విమాన సర్వీసుల్లో ప్రయాణ చార్జీలను అమాంతం పెంచేశారు. మదురై, తూత్తుక్కుడి, తిరుచ్చి, కోవై తదితరప్రాంతాలకు నడిచే 16 విమాన సర్వీసులు రద్దయ్యాయి. అదేవిధంగా ఆయా ప్రాంతాల నుంచి చెన్నైకు వచ్చే 16 విమాన సర్వీసులను కూడా రద్దు చేశారు. మదురై, తిరుచ్చి, పుదుచ్చేరిల నుంచి బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన 22విమాన సర్వీసులు రద్దయ్యాయి. అయితే కొన్ని ప్రైవేటుసర్వీసులు మాత్రం విమానాలను నడిపాయి. ఈ విమానాల్లో ప్రయాణ చార్జీలు కొండెక్కాయి. చెన్నై-మదురై ప్రాంతాల మధ్య రూ.3,129గా ఉండే ప్రయాణచార్జీ శనివారం రూ.20,599గా పెంచారు. అలాగే, చెన్నై-తిరుచ్చిమధ్య రూ.3,129నుంచి రూ.55,626గాను, చెన్నై- కోయంబత్తూరు మధ్య రూ.4,351గా ఉండే ప్రయాణ చార్జీ రూ.21,134గా వసూలు చేశారు.

తిరుచ్చిలో రోడ్డు ప్రమాదం : ఇద్దరి దుర్మరణం

అడయార్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా తువరంకురిచ్చి సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నై నగరంలో పనిచేసే ఒక మహిళా ఇన్‌స్పెక్టర్ భర్త, ఆమె కోడలు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. మదురై జిల్లా నాగమలైకు చెందిన ఫెడ్రిక్ (55)అనే వ్యక్తి మదురైలోని ఒక ప్రైవేటు కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య చెన్నై కొళత్తూరు పోలీస్ స్టేషనులో ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తున్నారు. వీరికి కుమారుడు మెల్విన్ (32) ఉండగా, చెన్నైలోని ఒక ఐటీ కంపెనీలో పనిచేస్తున్నారు. కోడలు ఆరోగ్య బ్రెసిల్లా (26), ఫెడ్రిక్ తన కుమారుడు, కోడలితో కలిసి చెన్నైకు వచ్చి తిరిగి శుక్రవారం రాత్రి మదురైకు బయలుదేరారు. వీరికారు శనివారం ఉదయం 9గంటల సమయంలో తిరుచ్చి జిల్లా తువరంకురిచ్చి జాతీయ రహదారి వంతెన రక్షణ గోడను ఢీకొట్టింది. ఆ సమయంలో భారీ వర్షం కురుస్తుండటంతోపాటు కారు వేగంగా వెళుతుండటంతో నియంత్రణ కోల్పోవడంతో ఈప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కారు ముందు భాగంలో కూర్చొనివున్న ఫెడ్రిక్ అక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన ఆరోగ్య బ్రెసిల్లాను సమీపంలోని ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది. సమాచారం అందుకున్న తువరంకురిచ్చి పోలీసులు ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మార్కులు తక్కువనే దిగులుతో విద్యార్థి ఆత్మహత్య



సుభాష్ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మార్కులు తక్కువ వచ్చాయని కళాశాల విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదానికి దారితీసింది. కోయంబత్తూర్ సెల్వపురానికి చెందిన సుభాష్ (19) కోవైలోని ఓ ప్రైవేటు కళాశాలలో బి.కాం రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో, ఇటీవల జరిగిన పరీక్షల్లో తక్కువ మార్కులు రావడంతో మనోవేదన చెందిన సుభాష్ ఈనెల 26న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. సాయంత్రం తల్లికి ఫోన్ చేసిన సుభాష్ మార్కులు తక్కువగా వచ్చాయని, నాకు బతికేందుకు విరక్తిగా ఉందని తెలిపాడు. తల్లి అతడిని సముదాయించింది. తాను ఉక్కడం పెరియకుళక్కరై ప్రాంతంలో ఉన్నట్లు తెలిపిన సుభాష్ ఫోన్ కట్ చేశాడు. తల్లిదండ్రులు, బంధువులు అతని కోసం ఆ ప్రాంతంలో గాలించినా ఫలితం లేకపోయింది. తల్లిదండ్రుల ఫిర్యాదుమేరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఆ ప్రాంతంలోని ఓ చెరువులో గాలించారు. రెండు రోజులు గడిచినా జాడ తెలియలేదు. ఈ క్రమంలో, కుళక్కరై ఆలయ సమీపంలో సుభాష్ మృతదేహాన్ని అగ్నిమాపక సిబ్బంది కనుగొని పోస్టుమార్టం నిమిత్తం కోవై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వాకింగ్‌లో సీఎంను కలిసిన నటి శృతిహాసన్




అడయార్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను సినీ నటి శృతిహాసన్ కలుసుకున్నారు. ముఖ్యమంత్రి శనివారం ఉదయం వాకింగ్ చేస్తున్న సమయంలో శృతిహాసన్ కూడా వాకింగ్‌కు వెళ్ళారు. ఆ సమయంలో సీఎంతో ఆమె కొద్దిసేపు ముచ్చటించారు. ముఖ్యమంత్రిగా ఎంతో బిజీగా ఉన్నప్పటికీ స్టాలిన్ ప్రతి రోజూ వాకింగ్‌కు వెళుతుంటారు. ఆ సమయంలో ఆయన పలు సందర్భాల్లో నగర వాసులు, ప్రముఖులతో ముచ్చటిస్తుంటారు. ఈ నేపథ్యంలో శనివారం సీఎం స్టాలిన్ వాకింగ్ చేస్తుండగా, అగ్ర నటుడు కమల్‌హాసన్ కుమార్తె, హీరోయిన్ శృతిహాసన్ కలుసుకుని కొద్దిసేపు ముచ్చటించారు. దీనికి సంబంధించిన వీడియో, ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ప్రియురాలిని హత్యచేసి ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రియురాలిని గొంతు కోసి హత్య చేసిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కరూర్ జిల్లాలో చోటుచేసుకుంది. వేలంపాడి రంగరాజ్ నగర్‌కు చెందిన వసంతకుమార్ (26) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. వసంతకుమార్ అదే ప్రాంతానికి చెందిన వేరే సామాజిక వర్గానికి చెందిన కళాశాల విద్యార్థినిని మూడేళ్లుగా ప్రేమిస్తున్నాడు. వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన వారు కావడంతో వీరి వివాహానికి ఇరు కుటుంబాలు అంగీకరించలేదని సమాచారం. ఈ కారణంగా ఇద్దరు ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రియురాలి ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన వసంతకుమార్, ఇంట్లోకి ప్రవేశించి బ్లేడుతో ఆమెగొంతు కోసి హతమార్చాడు. ఆమె మృతిచెందిందని నిర్ధారించుకున్న వసంతకుమార్, అదేగదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అరవకుర్చి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేపట్టారు.

నీలగిరి సమీపంలో పట్టుబడిన పులి



బోనులో చిక్కుకున్న పులి

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా గూడలూరు సమీపంలోని దేవర్‌షోలై ప్రాంతంలో గత నాలుగు నెలలుగా సంచరిస్తూ స్థానికులను బెంబేలెత్తించిన పులిని అటవీశాఖ సిబ్బంది చాకచక్యంతో బంధించడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. అడవులకు దగ్గరగా ఉన్న దేవర్‌షోలై ప్రాంతంలో నాలుగు నెలల క్రితం చొరబడిన పులి.. ఆవులు, గొర్రెలు, మేకలు, కోళ్లు కలిపి 30కి పైగా పెంపుడు ప్రాణులను వేటాడింది. రాత్రి సమయంలో పులి గాండ్రింపు శబ్దం విన్న స్థానికులు ఎప్పుడు దాడిచేస్తుందోనన్న భయంతో కంటిపై కునుకులేకుండా జాగారం చేశారు. పులిని బంధించాలంటూ వివిధ రకాలుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. దీనిపై స్పందించిన గూడలూరు అటవీశాఖ అధికారులు పులి సంచరిస్తున్నట్లు నిర్ధారించిన ఐదు ప్రాంతాల్లో ఇనుప బోనులను ఏర్పాటు చేసి మేకలను కట్టివేశారు. అయినప్పటికీ పులి పట్టుబడలేదని సమాచారం. దీనితో కేరళ రాష్ట్రం నేలంపల్లం నుంచి 30 అడుగుల పొడవుతో తయారుచేసిన భారీ సైజు ఇనుప బోనును దిగుమతి చేసుకుని దేవర్‌షోలై ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో, నాలుగు నెలలుగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన పులి ఎట్టకేలకు శుక్రవారం రాత్రి బోనులో చిక్కింది. స్థానికులు అందజేసిన సమాచారంతో శనివారం ఉదయం హుటాహుటిన అక్కడికి చేరుకున్న అటవీశాఖ సిబ్బంది పులిని లారీలో ఎక్కించుకుని గూడలూరులోని దట్టమైన అటవీప్రాంతంలో వదిలివేశారు. పులి పట్టుబడటంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మద్రాసు వర్శిటీ తెలుగుశాఖ ఆధ్వర్యంలో

4న ధర్మనిధి ఉపన్యాసాల ప్రారంభం

టి.నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో మెరీనా క్యాంపస్ రజతోత్సవ ప్రాంగణంలో రెండు రోజుల ధర్మనిధి ఉపన్యాసాలు డిసెంబర్ 4న ప్రారంభమవుతాయని ఆ శాఖ అధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు తెలిపారు. ఉదయం 10.15 గంటలకు తన అధ్యక్షతన జరిగే ప్రారంభ సమావేశంలో గోపురం పసుపు కుంకుమల సంస్థ అధినేత వైవి హరికృష్ణ ముఖ్య అతిథిగా, చెన్నై ఇమ్మర్ బెస్సర్ కన్సల్టెంటింగ్ సీఈవో బాలాంత్రపు శ్రీమతి రామనాథ్ ప్రత్యేక అతిథిగా, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య ఆత్మీయ అతిథిగా పాల్గొంటారని, రాజధాని కళాశాల విశ్రాంతాచార్యులు ఆచార్య ఎల్బీ శంకరరావు ప్రారంభోపన్యాసం చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆచార్య గంధం అప్పారావు ధర్మనిధి ఉపన్యాసంగా మద్రాసు విశ్వవిద్యాలయం మలయాళ శాఖాధ్యక్షులు ఆచార్య పీఎం గిరీష్ 'మలయాల సాహిత్యంలో మానవతావాదం' అనే అంశంపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఆ తర్వాత అర్కాటు ప్రకాశరావు ధర్మనిధి ఉపన్యాసంగా 'మహాత్మ్యకావ్యాలు - సామాజిక సందేశం' అనే అంశంపై శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రాచ్య పరిశోధనా కేంద్రం సంచాలకులు ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు, మధ్యాహ్నం 3.15 గంటలకు ములుమూడి ఆదిలక్ష్మి ధర్మనిధి ఉపన్యాసంగా 'జ్ఞాన ప్రసారమాధ్యమంగా అనువాదం-ప్రాచ్య, ప్రాచ్యాత్య దృక్పథాలు' అనే అంశంపై ఢిల్లీ విశ్వవిద్యాలయం భారతీయ భాషలు, సాహిత్య అధ్యయన కేంద్రం ఆచార్యులు గంపా వెంకటరామయ్య ప్రసంగిస్తారు. డిసెంబర్ 5 ఉదయం 10.30 గంటలకు ఎన్‌ఆర్ చందూర్ స్మారక ధర్మనిధి ఉపన్యాసంగా 'తెలుగు పత్రికలు - వికాస క్షేత్రాలు' అనే అంశంపై సికింద్రాబాద్ యోగాలయ సంచాలకులు విశ్వర్షి డా. వాసిలి వసంతకుమార్ ప్రసంగిస్తారు. ఉదయం 11.45 గంటలకు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ ధర్మనిధి ఉపన్యాసంగా 'మాడభూషి సంపత్కుమార్ కవిత్వం - సామాజికత' అనే అంశంపై కడప యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి ప్రసంగించనున్నారు. భోజన విరామం తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు ఆచార్య జీవీఎస్సార్ కృష్ణమూర్తి ధర్మనిధి ఉపన్యాసంగా 'తెలుగు - తెంగ్లీష్- ఇంగీష్ - అంతర్జాలంలో ధోరణులు' అనే అంశంపై మదురై విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ ప్రసంగిస్తారు. సాయంత్రం జరిగే ముగింపు సమావేశానికి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించారు. చెన్నై జియర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెడ్) అధ్యక్షులు పి.రవీంద్రకుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా, ప్రముఖ సంఘసేవకులు సేవారత్న కే రాధాలక్ష్మీ ప్రత్యేక అతిథిగా, నగరానికి చెందిన హోమియోపతి కన్సల్టెంట్ డా. దిట్టకవి అనంత పద్మనాభమూర్తి ఆత్మీయ అతిథిగా పాల్గొంటారు. రాజధాని కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డా. ఎన్.ఎలిజబెత్ జయకుమారి ధర్మనిధి ముగింపు సందేశం వెలువరిస్తారు.

తిరుచెందూరు వద్ద పడవలో వెళ్లి

అరటి గెలలు కోసిన రైతులు



అరటి గెలలను పడవలో తీరానికి తరలిస్తున్న రైతులు

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షానికి తిరుచెందూరు సమీపంలోని సెమ్మరికుళం కస్బా ప్రాంతంలో అరటి తోటలన్నీ జలదిగ్బంధంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ నేపథ్యంలో కోతకు సిద్ధంగా ఉన్న అరటి గెలలను కోయడానికి ఆ ప్రాంతానికి చెందిన రైతులు జాలర్ల వద్ద పడవలను అద్దెకు తీసుకుని శనివారం ఉదయం వాటిపైనే అరటి తోటలకు వెళ్లారు. అరటి తోటలలో ఆరడుగుల లోతున వర్షపునీరు ప్రవహిస్తుండటంతో పడవలను చెట్లకు దగ్గరగా తీసుకెళ్లి గెలలను వరుసగా కోశారు. ఆ తర్వాత అరటిగెలలను పడవలలో నింపుకుని తీరానికి చేర్చారు. ఇలా శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ రైతులు అరటి తోటలకు పడవపై వెళ్లి గెలలను కోసుకొచ్చి ఒడ్డుకు తరలించారు. ప్రతి యేటా వర్షాకాలంలో తమ అరటి తోటలు జలదిగ్బంధంలో చిక్కుకోవడం ఆనవాయితీగా మారిందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ నీటి గండం నుంచి తమ పంటలను కాపాడేలా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని అరటి రైతులు డిమాండ్ చేశారు.

తిరునల్వేలిలో నాసిరకం హల్వా


● అధికారుల తనిఖీల్లో వెల్లడి

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి హల్వా దుకాణాల్లో ఆహార భద్రతా విభాగం అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నాసిరకం హల్వాను స్వాధీనం చేసుకున్నారు. రుచి, నాణ్యతలో తిరునల్వేలి ఇరుట్టుకడైలో తయారుచేసే హల్వాకు ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. ఈ హల్వాను కొనుగోలు చేసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, కేరళ రాష్ట్రాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో తరలివెళుతుంటారు. ఇరుట్టుకడై హల్వాకు కొనుగోలుదారుల మధ్య పెరుగుతున్న ఆదరణ చూసి స్థానిక వ్యాపారులు కొంతమంది హల్వా దుకాణాలు నడుపుతున్నారు. ఇటీవల కాలంగా కొన్ని దుకాణాల్లో నాసిరకం హల్వాను విక్రయిస్తున్నట్లు స్థానిక ఆహార భద్రతా విభాగం కార్యాలయానికి ఫిర్యాదులు అందాయి. వాటి ఆధారంగా తిరునల్వేలి జిల్లా ఆహారభద్రతా అధికారి పుష్పరాజ్ నేతృత్వంలో శనివారం ఉదయం తిరునల్వేలి ప్రాంతంలోని హల్వా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ దుకాణాలకు లైసెన్సులు ఉన్నాయా? హల్వా ప్యాకెట్లలో తయారుచేసిన తేదీ, ఎక్స్‌పైరీ తేదీ దుకాణం వివరాలు తదితరాలను తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో విక్రయాలకు సిద్ధంగా ఉంచిన నాసిరకం హల్వా, నిషేధించిన ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకున్నారు.

డ్రగ్స్ విక్రయించిన వ్యక్తికి పదేళ్ల జైలుశిక్ష

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిషేధించిన డ్రగ్స్ విక్రయిస్తూ పట్టుబడిన వ్యక్తికి న్యాయస్థానం పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1లక్ష జరిమానా విధిస్తూ తీరునిచ్చింది. స్థానిక ఎరుకంజేరిలో గత2019 డిసెంబరు24న మెతాబెటమిన్ అనేమాదకద్రవ్యాన్ని విక్రయించిన నేరానికి రాజా(28)ను పోలీసులు అరెస్ట్ చేసి అతడి నుంచి 6కిలోల మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. చెన్నై మాదకద్రవ్యాల తరలింపు నిరోధక ప్రత్యేక కోర్టులో సాగిన ఈకేసు విచారణ పూర్తికాగా, శుక్రవారం న్యాయమూర్తి గోవిందరాజన్ నిందితుడు రాజాకు పదేళ్ల జైలు శిక్షను విధిస్తూ తీర్పు వెలువరించారు.

కాక్కుమ్ కరంగళ్ వృద్ధాశ్రమానికి ఆస్కా మేనేజింగ్ ట్రస్టు రూ.25వేల విరాళం



కాక్కుమ్ కరంగళ్ మేనేజింగ్ ట్రస్టీ జీపీ మనోహరన్‌కు చెక్కును అందజేస్తున్న ఆస్కా మేనేజింగ్ ట్రస్టీ వి.కోటారెడ్డి తదితరులు

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలకు తమవంతు ఆర్థిక సహాయాలను అందించే ఆస్కా ట్రస్టు స్థానిక వెస్ట్‌మాంబళంలో 'కాక్కుమ్ కరంగళ్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నడుపుతున్న వృద్ధాశ్రమానికి రూ.25 వేల విరాళాన్ని అందించింది. ఆదివారం ఉదయం ఆస్కా మేనేజింగ్ ట్రస్టీ వి.కోటారెడ్డి, కార్యదర్శి పి.సంతోష్‌కుమార్, కోశాధికారి బీవీఎస్ కోటేశ్వరరావు ఆ వృద్ధాశ్రమానికి వెళ్లి కాక్కుమ్ కరంగళ్ మేనేజింగ్ ట్రస్టీ జీపీ మనోహరన్‌కు విరాళాన్ని చెక్కు రూపంలో అందించారు. ఆస్కా ట్రస్టీలు పి.మనోహర్‌రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

రోగులకు సహాయాల పంపిణీ

తిరుత్తణి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదినాన్ని పురస్కరించుకుని తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు డీఎంకే కార్యదర్శి, న్యాయవాది సీజే శ్రీనివాసన్ రోగులకు సహాయాలను పంపిణీ చేశారు. స్థానిక డీఎంకే శ్రేణులతో కలిసి ఆయన పళ్లిపట్టు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి రోగులను పరామర్శించారు. అనంతరం శ్రీనివాసన్ పేరూర్ కార్యదర్శి సీజే సెంథిల్‌కుమార్ సమక్షంలో రోగులకు సహాయాలను అందజేసి స్వీట్లు పంచిపెట్టారు. యూనియన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు ఎం.బాబు, యూత్ విభాగం ఆర్గనైజర్ ఎస్‌ఏ.ఖలీల్, కో-ఆర్గనైజర్ కె.దివాకర్, కె.సద్దాంహుస్సేన్, తిరుమాళ్, గోపీనాథన్, పేరూర్ యూత్ ఆర్గనైజర్ సతీష్, డీఎంకే నిర్వాహకులు జగదీష్, లోకేష్, కొళత్తూర్ వీ.పాల్, శేఖర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఇటీవల కాలంలో కోలీవుడ్‌లో నిర్మించే చిత్రాలకు మాతృభాషలో పేర్లుపెట్టడం గగనంగా మారింది. పెద్ద హీరోల నుంచి కొత్త హీరోల వరకు తమ చిత్రాలకు ఆంగ్లంలోనే పేర్లు పెడుతున్నారు. పాన్ ఇండియా వ్యామోహంలో పడిన దర్శక నిర్మాతలు అభిమానుల అభిరుచి, ఇష్టాయిష్టాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వ్యాపారకోణంలోనే ఆలోచన చేస్తూ తమ చిత్రాలకు ఆంగ్లంలోనే పేర్లుపెట్టి రిలీజ్ చేస్తున్నారు.




'జైలర్'లో రజనీకాంత్ - 'విక్రమ్'లో కమల్ హాసన్

కోలీవుడ్ మూవీలకు


తమిళ పేర్లు ఎక్కడ?

- పాన్ ఇండియా మోహంలో నిర్మాతలు?
- పనిచేయని పన్ను ప్రోత్సాహం

కథ డిమాండ్ చేస్తే ఒకే... : కథ డిమాండ్ చేస్తే ఆంగ్లంలో టైటిల్స్ పెట్టడంలో తప్పులేదని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. గతంలో స్టోరీకి అనుగుణంగా పలు చిత్రాలకు ఇంగ్లీష్ టైటిల్స్ పెట్టారు. 'సీఐడీ శంకర్', 'జస్టిస్ విశ్వనాథన్', 'మై డియర్ కుట్టిసాత్తాన్', 'కెప్టెన్ ప్రభాకరన్', 'జెంటిల్‌మేన్', 'లక్కీమేన్', 'లవ్ బర్డ్స్', 'యూత్', 'జీన్స్', 'వన్స్ మోర్' ఇలా అనే చిత్రాలకు ఆంగ్లంలో టైటిల్స్ పెట్టగా, వాటిని ప్రేక్షకులు కూడా స్వాగతించి, ఆదరించారు.

మార్కెటింగ్ ప్రభావమేనా? : ఇపుడు తమిళ చిత్రాలకు మాతృభాషలో తమిళ పేర్లు పెట్టకపోవడానికి కారణం మార్కెటింగ్. కథ బాగుంటే కచ్చితంగా విజయం సాధిస్తుందన్నది ఆ కాలం. కానీ, ఇప్పుడు నిర్మించే చిత్రాలకు భారీ స్థాయిలో మార్కెటింగ్ చేయాల్సిన నిర్బంధ పరిస్థితి నెలకొంది. కళ, వాణిజ్యం మధ్య కొట్టుమిట్టాడుతున్న దర్శకనిర్మాతలు, పంపిణీదారులు ఎక్కువగా ఆంగ్ల టైటిల్స్‌కే మొగ్గు చూపుతున్నారు. ఇంగ్లీష్‌లో టైటిల్స్ పెట్టడం వల్ల ఇతర భాషల్లో కూడా రిలీజ్ చేసి బిజినెస్ చేసుకోవచ్చని వారి ప్రధాన ఆలోచనగా ఉంది. అందుకే తమిళ టైటిల్స్ కంటే ఆంగ్లం టైటిల్స్‌కే మొగ్గు చూపుతున్నారు.

అదేబాటలో అగ్ర హీరోలు సైతం.. : చిన్నాపెద్దా అనే తేడా లేకుండా హీరోలందరూ తమతమ చిత్రాలకు ఆంగ్లంలో టైటిల్స్ పెట్టేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ 'జైలర్', అగ్రనటుడు కమల్ హాసన్ 'విక్రమ్', విజయ్ 'లియో', శివకార్తికేయన్ 'డాన్', అజిత్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ', విక్రమ్ 'కోబ్రా' ఇలా అనేక మంది చిన్న, పెద్ద హీరోలు తమ చిత్రాలకు ఇంగ్లీష్‌లో పేర్లు పెట్టేందుకు ఇష్టపడుతున్నారు.

'గుడ్ బ్యాడ్ అగ్లీ'లో అజిత్ - 'లియో'లో విజయ్

తమిళంలో పేర్లు పెట్టాలి... : కోలీవుడ్‌కు చెందిన సీనియర్ దర్శకులైన ఆర్‌వీ ఉదయకుమార్,పేరరసు, ఆర్‌కే సెల్వమణి, నిర్మాత కె.రాజన్ వంటి సినీ ప్రముఖులు ప్రతి చిత్రానికి తమిళంలో పేర్లు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక సినిమాకు మార్కెటింగ్ స్ట్రాటజీ మారొచ్చు.. కానీ, దాని ఆత్మ మారదు అన్నది వారి అభిప్రాయం. ఇంగ్లీష్ టైటిల్స్ బాగున్నప్పటికీ వాటికి తగినట్టుగా తమిళంలో ఆకర్షణీయమైన పేర్లు పెడితే ఎంతో బాగుంటుందని వారు కోరుతున్నారు. అభిమానులు కూడా తమిళ టైటిల్స్‌నే కోరుకుంటున్నారని వారు చెబుతున్నారు.

అతిపెద్ద వినోద వేదిక...

ప్రతి ఒక్కరికీ అతిపెద్ద వినోద వేదిక సినిమా. ఈ రంగానికి ఎల్లవేళలా ప్రత్యేక గుర్తింపు ఉంది. కళతో పాటు సంస్కృతిని పరిరక్షించే రంగం సినిమా. అయితే, ఇటీవల కాలంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సినిమాలకు మాతృభాషలో పేర్లు పెట్టడం గణనీయంగా తగ్గిపోయింది. అదేసమయంలో ఇంగ్లీష్‌లో టైటిల్స్ పెట్టి రిలీజ్ చేస్తున్నారు.

చిత్రజ్యోతి



'డాన్'లో శివకార్తికేయన్

పనిచేయని పన్ను ప్రోత్సాహం

సినిమాలకు తమిళంలో పేర్లు పెడితే వినోదపు పన్ను మినహాయింపు ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఆ రాయితీ ఏమాత్రం పనిచేయడం లేదు. తమిళంలో పేర్లు పెట్టడం వల్ల పాన్ స్థాయి, ఓటీటీ బిజినెస్ కోల్పోవాల్సి వస్తుందన్నది నిర్మాతల అభిప్రాయం. అందుకే ప్రభుత్వం ఇచ్చే రాయితీ కంటే ఇతర బిజినెస్‌లకే అధిక ప్రాధాన్యత ఇస్తూ తమ చిత్రాలకు నిర్మాతలు ఆంగ్లంలో పేర్లు పెడుతున్నారు.

పందితో గొడవ ఎందుకు? : ఆర్తీ



పందితో గొడవ పెట్టుకోవద్దని హీరో రవి మోహన్ భార్య ఆర్తి అంటున్నారు. రవి మోహన్, ఆర్తి దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ కేసు చెన్నై ఫ్యామిలీ కోర్టులో పెండింగ్‌లో ఉంది. అదేసమయంలో రవి మోహన్ ప్రముఖ సింగర్ కెనిషాతో కలిసి ఉంటున్నారు. ఈ ముగ్గురి మధ్య కొంత కాలం మాటల యుద్ధం సాగింది. ఈ విషయంలో కోర్టు జోక్యం చేసుకుని, ఒకరిపై ఒకరు ఎలాంటి కామెంట్స్ చేసుకోవద్దని ఆదేశించింది. ఫలితంగా గత కొన్ని రోజులుగా రవి మోహన్, ఆర్తి, కెనిషాల మాటల యుద్ధం లేదు. ఈ నేపథ్యంలో ఆర్తి తాజాగా ఓ పోస్ట్ చేశారు. 'ఒక థెరపిస్ట్ ఇలా అన్నారు... పందితో ఘర్షణ పడొద్దు. నీవు, పంది కలిసి బురదలో చిక్కుకుంటారు. కానీ, ఆ బురదను ఎంజాయ్ చేసేది మాత్రం పంది మాత్రమే' అని పేర్కొన్నారు. ఈ పోస్ట్ కెనిషాను ఉద్దేశించి ఆర్తి చేశారనే కామెంట్స్ వినొస్తున్నాయి.

జనవరి 23న సూర్య 'కరుప్పు' రిలీజ్

సూర్య హీరోగా నటించే 'కరుప్పు' చిత్రం వచ్చే యేడాది జనవరి 23వ తేదీన విడుదలకానుంది. ఆర్‌జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం చిత్రీకరణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. అయితే, ఈ సినిమా విడుదల తేదీపై స్పష్టత లేకుండా ఉన్నది. కారణం శాటిలైట్ హక్కులు అమ్ముడుకాకపోవడమే. ఇప్పుడు ఈ హక్కులను జీ సంస్థ దక్కించుకోగా, ఓటీటీ రైట్స్‌ను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. దీంతో రిలీజ్ తేదీని ఖరారు చేశారు. కాగా, ఈ చిత్రంలో సూర్య సరసన త్రిష నటిస్తుండగా, ఇతర పాత్రల్లో నట్టి, ఇంద్రన్స్, అనకా మాయా రవి, స్వాశిక తదితరులు ఇతర పాత్రలను పోషించారు. జీకే విష్ణు ఛాయాగ్రహణం అందిస్తుండగా, సాయ్ అభయంకర్ సంగీతం, డ్రీమ్ వారియర్ పతాకంపై నిర్మాతలు ఎస్ఆర్ ప్రభాకర్, ఎస్ఆర్ ప్రభులు సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



'కరుప్పు'లో సూర్య



కొడుంగయూరు డంపింగ్ యార్డ్ వద్ద జరుగుతున్న బయోమైనింగ్ పనులు

డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోతున్న చెత్తకుప్పలు



SUNDAY SPECIAL

తెల్లవారితే తలుపు తీయలేరు...!

- ఒకవేళ తీస్తే ఆ దుర్వాసనలను భరించలేరు
- వారి పాలిట శాపంగా మారిన కొత్త నోటిఫికేషన్
- కొడుంగయూరు వాసుల గోడు పట్టించుకునే నాథులే లేరా?

ఉత్తర చెన్నై ప్రాంతంలో ఎవరైనా నడచివెళుతుంటే అకస్మాత్తుగా ముక్కుపుటాలు అదిరిపోయేలా దుర్వాసన వస్తే కొడుంగయూరు ప్రాంతానికి చేరువయ్యారని అర్థం.. కిలో మీటర్ దూరం వరకూ నడిచి వెళ్లేలోపే ఆ దుర్గంధం ముప్పు తిప్పలు పెట్టేస్తుంది. ఉత్తర చెన్నై ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తాచెదారంతో ఉన్న డంపింగ్ యార్డ్ నుంచే ఆ దుర్వాసన వస్తున్నట్లు కొద్ది క్షణాల్లోనే తెలుస్తుంది. ఇక డంపింగ్ యార్డ్ చుట్టూ నివసిస్తున్నవారు రోజంతా.. యేడాది పొడవునా... యేళ్ల తరబడి ఆ దుర్వాసనను ఎలా భరిస్తున్నారో కదా! అని బాధపడుతూ అక్కడి నుంచి కదులుతారు. ఆ తర్వాతే ఆ డంపింగ్ యార్డ్‌ను తొలగించి తమను, తమ సంతతిని కాపాడాలని స్థానిక ప్రజలంతా సుదీర్ఘ పోరాటం సాగిస్తున్నారనే విషయం తెలుసుకుంటారు...

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

నోటిఫికేషన్ పట్ల ఆందోళన: ఇలాంటి దుర్భరపరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న వారి గుండెల్లో గునపాన్ని దించేలా కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ చెత్త చెదారాలు, వ్యర్థాల నిర్వహణపై ఓ నోటిఫికేషన్ జారీ చేసింది. కామన్ మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఫెసిలిటీ (సీఎంఎస్ డబ్ల్యూఎంఎఫ్) అనే ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతి పొందటం నుంచి మినహాయింపు కల్పించే దిశగా ఆ ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ నోటిఫికేషన్ తమ పాలిట శాపంగా మారుతుందని కొడుంగయూరు నివాసులు ఆందోళన చెందుతున్నారు.పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి ముందస్తు అనుమతులు లేకుండానే ఆ ప్రాంతంలో భారీస్థాయిలో నిప్పుల కొలిమి (టన్నుల కొద్దీ చెత్తను క్షణాల్లో కాల్చే యంత్రాలను ఏర్పాటు చేసే) ప్రాజెక్టు అమలయితే తమ ఆరోగ్యానికి హాని కలుగుతుందని భయపడుతున్నారు. ఆ ప్రాజెక్టు అమలుకు స్వస్తి చెప్పి, ఆ డంపింగ్ యార్డునే తొలగించాలని పట్టుబడుతున్నారు.

చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి పథకం...

గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి రోజూ సుమారు 6150 మెట్రిక్ టన్నుల చెత్తకుప్పలు సేకరిస్తున్నారు. మధ్య చెన్నై, దక్షిణ చెన్నై ప్రాంతాల నుంచి సేకరించే చెత్తకుప్పలను 200 ఎకరాల విస్తీర్ణం కలిగిన పెరుంగుడి డంపింగ్ యార్డులోను, ఉత్తర చెన్నై ప్రాంతాలలో సేకరించే చెత్తకుప్పలను 269 ఎకరాల విస్తీర్ణం కలిగిన కొడుంగయూరు డంపింగ్ యార్డ్‌లో నిల్వ చేస్తున్నారు. పెరుంగుడితో పోల్చుకుంటే కొడుంగయూరు డంపింగ్ యార్డుకు అత్యంత సమీపంలోనే జననివాస ప్రాంతాలు అధికంగా ఉన్నాయి. ఈ డంపింగ్ యార్డులో 2024 జూలై నుంచి బయోమైనింగ్ పథకం అమలు చేస్తున్నారు. 2027లో ఫిబ్రవరిలో ఆ పథకం ముగియగానే, భారీ పరిమాణంలో చెత్తాచెదారం తొలగింపబడి ఏర్పడబోయే ఖాళీ స్థలాలలో చిట్టడవులను తలపించేలా 'నగర వనాలు' రూపొందించే పథకాన్ని అమలు చేయాలని కార్పొరేషన్ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆ డంపింగ్ యార్డులో రోజూ 2100 టన్నుల చెత్తకుప్పలను కాల్చటం ద్వారా 31 మెగా వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని కార్పొరేషన్ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈ విషయం తెలియగానే ఉత్తర చెన్నై నివాసులు తీవ్రనిరసన ప్రకటించారు. ధర్నాలు, రాస్తారోకో, నిరాహార దీక్షలు, ముగ్గులు వేయటం, మానవహారం వంటి ఆందోళనలు జరిపారు. ఈ ఆందోళనలకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మద్దతు ప్రకటించి, నిరసన ప్రదర్శనలలో పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉత్తర చెన్నై పూర్తిగా విషపూరిత ప్రాంతంగా మారే ప్రమాదం ఉందని స్థానికులు భీతిల్లుతున్నారు.

దుర్వాసనతో భోజనం చేయలేం...



'కొడుంగయూరు డంపింగ్ యార్డ్ దుర్వాసనల కారణంగా ఎళిల్‌నగర్‌లో ఉంటున్న మా జీవితాలు ఇప్పటికే నరక ప్రాయంగా మారాయి. తెల్లవారితే తలుపు తీయలేం. తలుపుతీస్తే ఆ దుర్వాసనను భరించలేం, కడుపులో వికారం, వాంతులు కలుగుతాయి. బయోమైనింగ్ పనులు ప్రారంభమైన తర్వాత, జేసీబీ యంత్రాల ద్వారా పాత చెత్తలను తొలగించినప్పుడు భరించలేని దుర్వాసనలు వచ్చాయి. ఆ సమయంలో వండిన ఆహారాన్ని కూడా తినలేం. మనుమలు, మనవరాళ్లు వేరే చోటుకు వెళ్లిపోదాం అని చెబుతున్నారు. నాలుగైదు దశాబ్దాలుగా ఇక్కడే ఉన్నాం. ఆ దుర్వాసనకు భయపడి మరోచోటుకి ఎలా వెళ్లగలం?

- సెల్వి, ఎళిల్‌నగర నివాసి

మంచి పథకమే... అయితే అక్కడొద్దు...!



కొడుంగయూరు డంపింగ్ యార్డ్‌లో విద్యుత్ నిప్పుల కొలిమిలో చెత్తను కాల్చి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే పథకాన్ని స్వాగతిస్తున్నాం. ఐదు కిలోమీటర్ల దూరంలో ప్రజలు నివసించని చోట ఆ యంత్రాన్ని ఏర్పాటు చేసి చెత్తను కాల్చితే సమంజసంగా ఉంటుంది. ప్రస్తుతం డంపింగ్ యార్డుకు వెనుక భాగంలోని ప్రాంతాన్ని ఆ దహన యంత్రం ఏర్పాటుకు ఎంపిక చేశారు. ఆ ప్రాంతం వద్ద కూడా ప్రజలు నివసిస్తున్నారు. కనుక ఆంధ్రా, తమిళనాడు సరిహద్దులో దహన యంత్రం ఏర్పాటు చేసి చెత్తను కాల్చితే ఎవరికీ ఎలాంటి హాని కలగదని భావిస్తున్నాను.

- ఢిల్లీబాబు,
37వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్

ఈ ప్రాజెక్టు ప్రాణాంతకం...!

కొడుంగయూరు డంపింగ్ యార్డ్‌లో చెత్తను తగులబెట్టడానికి బదులు కార్పొరేషన్ అధికారులు ప్రత్యామ్నాయ పథకాలపై దృష్టిసారించాలి. ఈ డంపింగ్ యార్డు వద్ద దహన యంత్రం ద్వారా టన్నుల కొద్దీ చెత్తను కాల్చితే భారీ పరిమాణంలో కర్బనవాయువులు వెలువడుతాయి. దీనితో స్థానిక ప్రజలు ప్రాణవాయువుకు బదులు కర్బన వాయువును పీల్చి చావుకు దగ్గరవుతారు. స్థానిక ప్రజలకు ప్రాణాంతకంగా మారే ఈ ప్రాజెక్టును అమలు చేసి తీరుతామంటూ కార్పొరేషన్ భీష్మించడం సరికాదు'.



- కే సుందరరాజన్, అధ్యక్షులు,
'భూఉలగిన్ నన్బరగళ్' సంస్థ

దహనయంత్రం ఏర్పాటు తప్పనిసరి..!

కొడుంగయూరు డంపింగ్ యార్డులో దహన యంత్రంతో చెత్తను కాల్చటం అత్యంత అవసరం. ఆ డంపింగ్ యార్డ్‌లోని చెత్తను దాదాపు 30 యేళ్లుగా రీసైక్లింగ్ చేయలేదు. అక్కడ వర్షం కురిస్తే నీరంతా ఆ చెత్తలోకి వెళుతోంది. భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి ప్రస్తుతం బయోమైనింగ్ ద్వారా 25 ఎకరాల స్థలాన్ని శుభ్రపరిచాం. లక్షలాది టన్నుల మేరకు పేరుకుపోతున్న చెత్తను దహన యంత్రం ద్వారానే వీలయినంత త్వరగా తొలగిస్తాం. ఈ పథకంపై స్థానికులలో నెలకొన్న భయాందోళనలను ప్రాజెక్టు నిపుణుల ద్వారా పోగొడతాం. స్థానిక ప్రజల అభిప్రాయాలను పూర్తిగా తెలుసుకున్నాకే దహన యంత్రం ఏర్పాటు చేస్తాం.



- మహేష్‌కుమార్, డిప్యూటీ మేయర్



ఆ నిప్పుల కొలిమి ప్రమాదకరం...!



'కొడుంగయూరులో రోజుకు 2100 టన్నుల చొప్పున చెత్త చెదారం, వ్యర్థాలను తగులబెడతామని చెబుతున్నారు. అదే జరిగితే మనలి ప్రాంతం నివాసులకు పట్టిన గతే పడుతుంది. మనలి సమీపంలో చిన్న మాత్తూరు వద్ద 10 టన్నుల కెపాసిటీ చెత్తకుప్పలను దహించే యంత్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ చెత్తను కాల్చిన తర్వాత మిగిలే బూడిద నమూనాలను సేకరించి ఐఐటీలో పరిశోధనలు జరిపించాం. అందులో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన పరిమితులకంటే ఎక్కువగా లోహాలు ఉన్నట్లు నిర్ధారించారు. ఇప్పుడు కొడుంగయూరులో అలాంటి నిప్పులకొలిమి యంత్రాలను ఏర్పాటుచేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. అదే జరిగితే అందరూ ఇతర ప్రాంతాలకు వలసపోవటం ఖాయం'

- డికే షణ్ముగం, అధ్యక్షుడు, ఉత్తర చెన్నైనివాసుల సంక్షేమ సంఘాల సమాఖ్య

గజవాహనంపై అరుణాచలేశ్వరుడు




వెండి గజవాహనంపై ఉన్నాములై సమేత అరుణాచలేశ్వరుడు - గజవాహనంపై విహరిస్తున్న విఘ్నేశ్వరుడు

వేలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లాలో అగ్నిక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన అరుణాచలేశ్వరాలయంలో గత సోమవారం ప్రారంభమైన కార్తిక దీపోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో 6వ రోజైన శనివారం తెల్లవారుజామున వెండి గజ వాహనంపై ఉన్నాములై అమ్మవారి సమేత అన్నామలైయార్‌ల ఉత్సవమూర్తులను అందంగా అలంకరింపజేసి ఆలయ మాడవీధుల్లో అర్చకుల వేద మంత్రోచ్చారణ, భక్తుల ఓం నమశ్శివాయ దివ్య నామస్మరణ, మేళతాళాల నడుమ ఊరేగింపు మహోత్సవం కన్నుల పండువగా సాగింది. అదేవిధంగా చిన్న గజ వాహనంపై గణపతిని ఊరేగింపజేయగా, ప్రత్యేక అలంకారంలో వల్లి,దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, పరాశక్తి అమ్మవారు, చండికేశ్వరుల ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి ఆశీనులను చేసి మాడవీధుల్లో పండితులు విహరింపజేశారు. ఇదిలా ఉండగా, వేర్వేరు పల్లకీలలో 63 మంది నాయన్మారులను పురవీధుల్లో ఊరేగించగా, హారతులతో భక్తులు ఎదురొచ్చి దర్శించుకుని పులకించిపోయారు. ఆలయ ప్రాంగణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పెద్దఎత్తున పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు.



నాయన్మారుల ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం

పుదుచ్చేరిలో సెబీ - ఎన్ఎస్ఈ ఆధ్వర్యంలో 'ఆర్ఐఎస్ఏ' సదస్సు

అడయార్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో సెబీ - ఎన్ఎస్ఈ ఆధ్వర్యంలో ప్రాంతీయ పెట్టుబడిదారుల అవగాహన సదస్సు (ఆర్ఐఎస్ఏ) శనివారం జరిగింది. ఇందులో బడ్జెట్, పొదుపు, పెట్టుబడి, రుణ నిర్వహణ వంటి వివిధ అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ఆర్థిక అక్షరాస్యత, పెట్టుబడిదారులకు అవగాహన, పెట్టుబడిదారుల రక్షణను మెరుగుపరిచే ప్రయత్నంలో భాగంగా దీన్ని నిర్వహించగా, ఇందులో ప్రభుత్వ ఉద్యోగులు, పెట్టుబడిదారులు, విద్యార్థులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే మాట్లాడుతూ, పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడేందుకు సెబీ పారదర్శకమైన, బలమైన, న్యాయమైన ఒక రెగ్యులేటరీ యాక్ట్‌ను రూపొందించిందన్నారు. పెట్టుబడిదారుల రక్షణ, మార్కెట్ సమగ్రత తమకు ఎంతో ముఖ్యమన్నారు. మానవాళికి, సమాజానికి ప్రయోజనం చేకూర్చే పెట్టుబడి సంస్కృతిని పెంపొందించడాన్ని ఆయన వివరించారు. అలాగే ఎన్ఎస్ఈ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ఆశిష్ కుమార్ చౌహాన్ మాట్లాడుతూ, పెట్టుబడిదారుల విద్య, అవగాహన, భద్రతకు దారిచూపే ప్రధాన లక్ష్యంతో ఎన్ఎస్ఈ పనిచేస్తుందన్నారు.



సదస్సులో పాల్గొన్న తుహిన్ కాంత పాండే, ఆశిష్ కుమార్ చౌహాన్

స్ఫూర్తి

SUNDAY SPECIAL



గుడుపల్లె మండలం యామగానిపల్లె స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందిస్తూ

జపాన్ హక్కయిడో యూనివర్సిటీలో పీహెచ్‌డీ రీసెర్చ్ గ్రూప్ సభ్యులతో

కుప్పం కుర్రోడి జపాన్ జర్నీ

మా అమ్మానాన్నలను బెంగళూరునుంచి చెన్నైదాకా విమానంలో తీసుకువెళ్లా. ఈ ప్రయాణం నాకు గొప్ప ఆనందాన్నిచ్చింది. పేదరికం, పల్లె చదువులు.. అని నిరాశ చెందనవసరం లేదు. నిరంతర శ్రమ, పట్టుదల, దృఢ సంకల్పం.. ఇవే నన్ను ఈ స్థితికి చేర్చాయి.

అమ్మానాన్నల వెంట పొలంలో కూలిపనులకు వెళ్లిన పిల్లవాడు... బస్సు క్లీనర్‌గా బతుకును ఈడ్చుకొచ్చిన యువకుడు.. చదువుల వంతెన మీదుగా కుప్పం పల్లెనుంచి జపాన్‌కు ఎగిరిపోయాడు. క్వాంటమ్ సైన్స్ (ప్లాస్మా టెక్నాలజీస్)లో నైపుణ్యం సాధించాడు. పీహెచ్‌డీ పట్టా అందుకున్నాడు. జపాన్‌లో ప్రస్తుతం అధునాతనమైన సెమీకండక్టర్ చిప్ డెవలప్మెంట్‌లో పనిచేస్తున్నాడు. మూలాలు మరచిపోకుండా ఇక్కడి విద్యార్థులకూ మార్గదర్శకుడిగా సేవలందిస్తున్నాడు. గోవిందపల్లె పిలగాడు మురుగేశ్ చదువులయాత్ర విశేషాలు.. ఈ ఆదివారం ప్రత్యేకం..

కుప్పం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం, గుడుపల్లె మండలంలో మారుమూల ఉండే గ్రామం గోవిందపల్లె. మురుగేశ్ పుట్టిన ఊరు ఇది. తల్లిదండ్రులు మునస్వామి, యల్లమ్మ బక్క రైతులు. కూలి పనులతోనే జీవనం సాగించేవారు. అమ్మానాన్నల వెంట కూలి పనులకు వెళ్లడం మురుగేశ్‌కూ తప్పేది కాదు. అయితే చిన్నప్పటి నుంచీ చదువులో ముందుండేవాడు. గుడుపల్లె మండలం శెట్టిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 2007-08లో టెన్త్ పరీక్షల్లో 542 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచాడు. ఇంజనీరింగ్ చేయాలన్నది మురుగేశ్ కల. ఇంటర్ చదువులకే ఆర్థిక స్తోమత లేదు. వేసవి సెలవుల్లో బస్సు క్లీనర్‌గా పనిచేస్తూ డబ్బులు పోగేసుకున్నాడు. రోజూ ఇంగ్లీషు పేపర్ కొని క్రమం తప్పకుండా చదివేవాడు.

ట్రిపుల్ ఐటీ దారి చూపింది

పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నాటి ప్రభుత్వం కల్పించిన అవకాశం వరంగా మారింది. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో మురుగేశ్‌కి సీటు లభించింది. అక్కడే ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఇంజనీరింగ్ పట్టా కూడా పొందాడు. ఆ తర్వాత విదేశాల్లో చదవాలన్న కోరికకు పేదరికం అడ్డొచ్చింది. అయినా ఆశ వదులుకోలేదు. పట్టుదలను కోల్పోలేదు. మూడేళ్ల పాటు ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ మద్రాసులలో పరిశోధనా మెలకువలు నేర్చుకుంటూ ఉన్నత చదువులకు తయారవుతూ వచ్చాడు. ఇది మురుగేశ్‌కి గొప్ప ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. మద్రాసు ఐఐటీలో మాస్టర్స్ ఎం.ఎస్. రీసెర్చ్ పట్టా పొందగలిగాడు.

జపాన్‌లో పీహెచ్‌డీ

ఐఐటీ చదువుల నిచ్చెన ఆసరాతో జపాన్ వైపు అడుగులు వేశాడు. పూర్తి స్కాలర్‌షిప్‌తో జపాన్‌లో పీహెచ్‌డీ పట్టా పొందాడు. ఆధ్యాత్మికపరమైన క్వాంటమ్ సైన్స్ (ప్లాస్మా టెక్నాలజీస్)లో పనిచేశాడు. గోవిందపల్లె పిలగాడు.. డాక్టర్ మురుగేశ్‌గా గౌరవం అందుకున్నాడు. జపాన్‌లో అధునాతనమైన సెమీకండక్టర్ చిప్ డెవలప్మెంట్‌లో ఇప్పుడు పనిచేస్తున్నాడు. ర్యాపిడస్ ఇంక్ జపాన్ కంపెనీలో ప్రాసెస్ ఇంజనీరు అతని హోదా.

బీజాలు వేసిన ఫిజిక్స్ టీచర్

ఇదంతా అంత సులువుగా జరగలేదు. కెరీర్‌లో మురుగేశ్ ఎక్కిన ప్రతి మెట్టు వెనుక ఎంతో శ్రమ ఉంది. స్ఫూర్తి నింపి ముందుకు నడిపించిన గురువుల పాత్ర ఉంది.2012లో ప్రాణిక్ హీలింగ్‌ను మురుగేశ్‌కు పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు మీనా పరిచయం చేశారు. ప్రాణిక్ హీలింగ్ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు గ్రాండ్ మాస్టర్ చోవా కోక్ సుయ్ శిక్షణా తరగతుల నుంచి, మాస్టర్ డేవిడ్ విజయకుమార్ ద్వారా ప్రేరణ పొందాడు. పీహెచ్‌డీలో కూడా ప్లాస్మా ప్రాసెసింగ్ రీసెర్చ్ సబ్జెక్టును అర్థం చేసుకోవడానికి ఈ ఇద్దరూ దారి చూపారని చెబుతారు మురుగేశ్.

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతూ

మారుమూల గ్రామం గోవిందపల్లె నుంచి జపాన్‌లో ఉన్నతోద్యోగంలో ఉన్న మురుగేశ్ యూట్యూబ్ చానల్ ద్వారానూ, ప్రత్యక్షంగానూ స్ఫూర్తి నింపే పనులు చేస్తున్నారు. భారతదేశంలోను, జపాన్‌లోను వివిధ కళాశాలలు, పాఠశాలలు సందర్శిస్తూ స్కిల్ డెవలప్‌మెంట్‌లో విద్యార్థులకు మెలకువలు నేర్పిస్తున్నారు. తన సొంత మండలమైన గుడుపల్లెలోని విద్యార్థులకూ అండగా నిలుస్తున్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలను జపాన్‌లో పరిచయం చేస్తూ, అందులోని విలువలను తెలియజెప్పుతున్నారు.



జపాన్‌లో మన సంస్కృతీ సంబరాలలో

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలో ఒక షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.47 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,044

తలనీలాలు సమర్పించినవారు: 25,559

చెన్నై మెట్రో ప్రాజెక్ట్-2

● సొరంగం తవ్వే పనులు పూర్తిచేసిన 'ముల్లై' ● ప్రారంభించిన 'కురింజ'



ముల్లై (టన్నెల్) యంత్రానికి స్వాగతం పలుకుతున్న సీఎంఆర్ఎల్ అధికారులు

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) రెండవ ప్రాజెక్ట్‌లోని 5వ మార్గంలో 'ముల్లై' పేరున్న యంత్రం సొరంగం తవ్వే పనులు విజయవంతంగా పూర్తిచేసి కొళత్తూర్ రైల్వేస్టేషన్ వద్ద వెలుపలికి వచ్చింది. అదే సమయంలో, కొళత్తూర్ నుంచి శ్రీనివాస నగర్ వరకు సొరంగం తవ్వే పనులను 'కురింజి' యంత్రం ప్రారంభించింది. నగరంలో మెట్రోరైలు రెండవ విడత ప్రాజెక్ట్ మూడు మార్గాల్లో 118.9 కి.మీ దూరం ఏర్పాటవుతోంది. ఈ ప్రాజెక్ట్‌లో రెండవ మార్గమైన మాధవరం పాల డిపో నుంచి కోయంబేడు, పోరూర్, అలందూర్ మీదుగా షోలింగనల్లూర్ వరకు 47 కి.మీ దూరం ఏర్పాటుకానుంది. ఐదో సొరంగ మార్గం రైల్వేస్టేషన్లు (5.9 కి.మీ దూరం), 39 ఫ్లైఓవర్ రైల్వేస్టేషన్లు (41.2 కి.మీ దూరం) ఏర్పాటవుతున్నాయి. ఈ మార్గంలో 5.9 కి.మీ దూరం సొరంగం తవ్వే పనులను కురింజి, ముల్లై, మరుదం, నెయిదల్ పేర్లతో నాలుగు యంత్రాలతో చేపడుతున్నారు. ఈ మార్గంలో, గత మే 23వ తేది కొళత్తూర్ ర్యాంప్ నుంచి సొరంగం తవ్వే పనులు ప్రారంభించిన 'ముల్లై' టన్నెల్ బోరింగ్ యంత్రం 246 మీటర్ల దూరం పూర్తిచేసి శుక్రవారం కొళత్తూర్ రైల్వేస్టేషన్ వద్ద బయటకు వచ్చింది. అదే సమయంలో, కొళత్తూర్ రైల్వేస్టేషన్ నుంచి శ్రీనివాస నగర్ వరకు 230 మీటర్ల సొరంగం తవ్వే పనులను 'కురింజి' టన్నెల్ బోరింగ్ యంత్రం ప్రారంభించినట్లు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు.

ఘనంగా మహర్షి విద్యామందిర్ వార్షికోత్సవం



సంప్రదాయ వస్త్రధారణలో జానపద, భక్తిగీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు - విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డాక్టర్ అనిరుధ్, టీవీ.రామకుమార్, ట్రస్టీలు

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధి చెందిన పురాతన శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ) ఛారిటీస్ నిర్వహణలోని మహర్షి విద్యామందిర్ సీనియర్ సెకండరీ పాఠశాల 11వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తేనాంపేటలోని కామరాజర్ అరంగంలో శనివారం ఉదయం 9 గంటలకు గౌరవ కరస్పాండెంట్ టీవీ.రామకుమార్ అధ్యక్షతన ప్రారంభమైన ఈ వేడుకల్లో లైఫ్ లైన్ గ్రూప్ ఆస్పత్రుల డైరెక్టర్ డాక్టర్ అనిరుధ్ రాజ్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ప్రిన్సిపాల్ వి.సుబ్రమణ్యం వార్షిక నివేదికలోని సారాంశాన్ని సభకు వివరించారు. ఎస్‌కేపీడీ యాజమాన్యం సహకారంతో పాఠశాల తరుఫున ఒక్కొక్క విద్యాసంవత్సరంలో చేపడుతున్న కార్యక్రమాలు, విద్యార్థుల్లో మేథోశక్తిని పెంచేలా చేపడుతున్న పథకాల గురించి తెలిపారు. 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలిచిన విజేతలకు ముఖ్యఅతిథి అనిరుధ్ రాజ్‌కుమార్ బహుమతులు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఉత్తమ విద్యార్థులు, టీచర్లు, పాఠశాల సిబ్బందికి ఎస్‌కేపీడీ ఛారిటీస్ తరుఫున బహుమతులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశం గర్వించదగ్గ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఎస్‌కేపీడీ ఛారిటబుల్ ట్రస్ట్ కొనసాగిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ట్రస్టీలు దేసు లక్ష్మీనారాయణ, సీఆర్.కిషోర్‌బాబు, ఎస్ఎల్ సుదర్శనం, తాతా బద్రినాథ్, వైస్ ప్రిన్సిపాల్ కవిత, మేనేజర్ శ్రీలత, విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యార్థిని, విద్యార్థులు జానపద, ఫోక్ తదితర నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం

● వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్



విద్యా సహాయాలు అందిస్తున్న ఛాన్సలర్ విశ్వనాథన్

వేలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి విద్యతోనే సాధ్యమవుతుందని వీఐటీ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ విశ్వనాథన్ తెలిపారు. స్థానిక వీఐటీ వర్సిటీ ప్రాంగణంలోని అన్నా ఆడిటోరియంలో అందరికి ఉన్నత విద్య ట్రస్ట్ కార్యక్రమంలో విద్యార్థులు విద్యా సహాయాలు అందించే కార్యక్రమం జరిగింది. కార్యక్రమం ట్రస్ట్ సభ్యురాలు మయిలాంబిక్కై ఆహ్వానంతో ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఛాన్సలర్ విశ్వనాథన్ రూ.1.75 కోట్ల విద్యా సహాయ నిధులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ... ప్రపంచ దేశాలు విద్యాభివృద్ధి తర్వాత ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారిస్తాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగానికి అందించే నిధులు పెంచాలన్నారు. దేశంలో ఉన్నత విద్య చదివే వారు 28 శాతంగా ఉందని, అభివృద్ధి చెందిన దేశాల్లో 100 శాతం ఉంటుందని తెలిపారు. విద్యలో కేరళ రాష్ట్రం మొదటి స్థానంలో ఉండగా, తమిళనాడు రెండోస్థానంలో నిలిచిందన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్నత విద్య అభ్యసించే వారి సంఖ్య పెరగాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఉపాధ్యక్షులు శేఖర్ విశ్వనాథన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంధ్యా పెండారెడ్డి, ఉన్నత విద్య ట్రస్ట్ సభ్యులు వెంకటసుబ్బు, లక్ష్మణన్, అబ్దుల్ ఖాదర్, రచయిత పధుమనార్, రమేష్ జైన్, చంద్రశేఖరన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వచ్చే యేడాది తిరువొత్తియూరు పాలిటెక్నిక్ ప్రారంభం

● మంత్రి శేఖర్ బాబు వెల్లడి

అడయార్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొట్రియూరులో కొత్తగా ప్రభుత్వం నెలకొల్పిన పాలిటెక్నిక్‌లో వచ్చే యేడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయని రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి పీకే శేఖర్ బాబు వెల్లడించారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశం మేరకు తిరువొట్రియూరులో ఐటీఐ, పాలిటెక్నిక్ నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ఈ కాలేజీ వచ్చే యేడాది అందుబాటులోకి వస్తుందన్నారు. తిరువొట్రియూరు, మాధవరం, ఆర్‌కే నగర్ ప్రాంతాల్లో దారిద్ర్యరేఖకు దిగువన నివసించే విద్యార్థినీ విద్యార్థులకు ఇది ఒక వరప్రసాదంగా ఉంటుందన్నారు. ఈ కాలేజీలో వచ్చే యేడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తామన్నారు. అవసరమైన మౌలిక సదుపాయాలను దశల వారీగా కల్పిస్తామన్నారు. ఆర్‌కే నగర్ నియోజకవర్గంలో ఒక గ్రంథాలయం, ఐపీఎస్, ఐఏఎస్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణా కేంద్రం ప్రారంభించామని మంత్రి శేఖర్ బాబు వివరించారు.

తిరుత్తణి-తిరుచెందూర్‌కు స్లీపర్ బస్సులను ఏర్పాటు చేయండి

● మంత్రి శివశంకర్‌కు ఎమ్మెల్యే చంద్రన్ వినతి

తిరుత్తణి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి నుంచి తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయానికి ప్రత్యేక స్లీపర్ బస్సులను ఏర్పాటు చేయాలని మంత్రి శివశంకర్‌ను ఎమ్మెల్యే చంద్రన్ శనివారం ఉదయం కోరారు. ఇటీవల తిరుత్తణి బస్‌స్టేషన్ నుంచి తిరుచెందూరుకు రాష్ట్ర రవాణాశాఖ ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో, తిరుచెందూరు దూరప్రాంతం కావడంతో బస్సులో ప్రయాణించే వృద్ధులు, మహిళలు, పిల్లలు రాత్రి సమయాల్లో సీట్లలో కూర్చోలేక ఇబ్బందులు పడుతున్నారని, కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణం చేసే వారికష్టాలను పలుమార్లు దగ్గరనుంచి చూశానని ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ఓ ప్రకటనలో తెలిపారు. దీనిని నివారించేందుకు తిరుత్తణి బస్‌స్టేషన్ నుంచి తిరుచెందూర్‌కు 31 సీట్లు, 15 పడకలతో కూడిన స్లీపర్ బస్సులను ప్రారంభించాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి శివశంకర్‌కు లేఖరాసినట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా బస్‌స్టేషన్‌లో వసతులను మెరుగుపరచాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు.

నేడు భగవద్గీత శ్లోకాల పారాయణం

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీనగర్ నటేశన్ పార్క్ వెనుకనున్న గురుభద్రి కల్యాణ మండపంలో ఇస్కాన్ టీ.నగర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత శ్లోకాల పారాయణం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 9.30 గంటలకు కీర్తన, 10 గంటలకు 'గీత యజ్ఞ' పేరుతో భగవద్గీతలోని 700 శ్లోకాల పారాయణం జరుగనుంది. మధ్యాహ్నం 12 గంటలకు జయపతాక స్వామి గురు మహరాజ్ భక్తులకు ప్రత్యేక బోధనలను అందించనున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.



గౌతమ బుద్ధుని వృత్తాంతం





తమిళనాడులోని దక్షిణ చిత్ర మ్యూజియంలో విజయకుమార్‌చే కలంకారీ శిక్షణ పొందుతున్న యూరప్ వాసులు

కృష్ణ లీలలు

ఆవులకొండ విజయ్‌కుమార్ కన్నుమూత

శ్రీకాళహస్తికి చెందిన ప్రసిద్ధ కలంకారీ కళాకారుడు ఆవులకొండ విజయకుమార్ శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. శ్రీకాళహస్తి పట్టణ శివారు ప్రాంతమైన పెంకులపాడులో ఇంటి వద్దనే ఆయన మృతి చెందారు. కలంకారీ కళాకారుడిగానే కాక, కలంకారీ గురువుగా విజయకుమార్ పేరుపొందారు. దేశ, విదేశాలకు చెందిన ఎందరికో కాళహస్తి కలంకారీ కళను నేర్పించారు. ఎనిమిది పదుల వయసులోనూ కలంకారీ నేర్చుకుంటామని వచ్చే వారికి ఓపిగ్గా నేర్పించేవారు. ఇటీవలే తమిళనాడుకు చెందిన నలుగురు రెండు నెలలపాటు శిక్షణ పొందేందుకు ఆయన వద్దకు వచ్చారు. శిక్షణ పూర్తికాకముందే ఆనారోగ్యంతో ఆయన కన్నుమూశారు. విజయకుమార్‌కు నివాళిగా ఆయన కళాజీవనయాత్ర విశేషాలు..

■ నివాళి

కలంకారీ గురువు



కనకదుర్గమ్మ

1968లో విజయ్ కుమార్ శ్రీకాళహసిలోని కలంకారి శిక్షణ శిబిరంలో విద్యార్థిగా చేరారు. రెండేళ్లపాటు ఎ. మునికృష్ణయ్య, రమణయ్య, రాంబోజి నాయక్ వద్ద శిక్షణ పొందారు. ఆ తర్వాత అదే శిబిరంలో నాలుగు సంవత్సరాల పాటు బొమ్మలు గీసే కళాకారుడిగా శిక్షణ ఇస్తూ, పని చేశారు. రోజువారి వేతనంపై కలంకారి బొమ్మలు గీశారు. 1976 నుంచి ఈ శిక్షణ శిబిరం అనేక ఆటుపోట్లు ఎదుర్కొని 1988లో శాశ్వతంగా మూతపడింది. ఆ తర్వాత ఆయన కలంకారీ చిత్ర రచనమీదకన్నా శిక్షణ మీద ఎక్కువ దృష్టి పెట్టారు. స్థానికులే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి సైతం ఔత్సాహికులు ఆయన వద్ద శిక్షణ పొందారు.ఫ్రాన్స్ దేశం నుంచి ఆంద్రే దంపతులు ప్రత్యేకంగా ఏడాదిలో వారం రోజులు శ్రీకాళహస్తిలో ఉంటూ పది సంవత్సరాలపాటు విజయ్ కుమార్ వద్ద కలంకారీ రాతపని నేర్చుకున్నారు. శ్రీకాళహస్తిలో ఎన్నో శిక్షణా శిబిరాలు నిర్వహించారు. కావలిలో రెండు బ్యాచ్‌లకు ట్రైనింగ్ ఇచ్చారు. తమిళనాడు మహాబలిపురం రోడ్‌లోని దక్షిణచిత్ర మ్యూజియంలో 2000 సంవత్సరం నుంచి 2020 వరకు కలంకారి గురువుగా వారాంతపు రోజుల్లో పలువురికి నేర్పించారు. యూరప్ ఖండం నుంచి 14 దేశాలకు చెందిన కళాభిమానులు ఈయన వద్ద కలంకారీ నేర్చుకున్నారు. వారానికి ఒక రోజు బెంగళూరులోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలోనూ, మరొక రోజు చెన్నైలోని నిఫ్ట్ కళాశాలలోనూ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేవారు. కరోనా తర్వాత తన శిక్షణా కార్యక్రమాలను శ్రీకాళహస్తిలోని ఇంటికే పరిమితం చేసుకున్నారు. నాలుగేళ్లగా చెన్నై ఫైనార్ట్స్ కళాశాల విద్యార్థులు శ్రీకాళహస్తికే వచ్చి శిక్షణ పొందేవారు. శ్రీకాళహస్తిలో కరుణ అనే పేరుతో కలంకారీ కళాకారుల సంక్షేమ అసోసియేషన్ కూడా ఆయన ఏర్పాటు చేశారు. కలంకారీ కళాకారుడిగా విజయ్‌కుమార్ భారతం, రామాయణం, కృష్ణ లీలలు, భాగవతం, గౌతమ బుద్ధుని వృత్తాంతం, అష్టలక్ష్మి, దశావతారాలు వంటి ఇతిహాస చిత్రాలను కలంకారీలో గీశారు. 55 ఏళ్ల క్రితం కలంకారి వృత్తి నేర్చుకున్న తొలి నాళ్లలో వేసిన కనకదుర్గమ్మ, గీతోపదేశం, గౌతమ బుద్ధ వృత్తాంతం చిత్రాలను మాత్రం ఇప్పటికీ బాల్యానికి గుర్తుగా తన వద్దే భద్రపరచుకున్నారు. 'హస్త కళల్లో కలంకారీ ఒక అద్భుతం. వస్త్రంపై బొమ్మలు గీసి సహజ సిద్ధమైన ప్రకృతి రంగులను అద్దటం పురాతన ప్రక్రియ. యాంత్రీకరణ ఎప్పటికప్పుడు అన్ని రంగాలపై ప్రభావం చూపుతున్నా కలంకారీ హస్తకళకు మాత్రం ఆదరణ తగ్గలేదు.' అని ఆయన చెప్పేవారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి